ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 18, 2004

కోనసీమ

సిరులు కురిపిస్తున్న 'క్రికెట్'

హ్యాపీ బర్త్‌డే

(18-4-2004నుండి 24-4-2004వరకు)

డి. సత్యాదేవి
4సు॥, 19,4,1999
కల్పన-రమణ
కాపవరం-ప॥గో॥

ఎ. సంతోషి(సౌమ్య)
3సు॥, 19,4,2001
రజని-మురళి
తిరువూరు-కృష్ణా

రాగిణి
ఏప్రిల్-20
గురులక్ష్మి-దర్గయ్య
మహబూబాబాద్-వరంగల్

కె. భావన
9సు॥, 21,4,1995
పద్మావతి-అంజయ్య
బోయిగూడ-హైదరాబాద్

అమూల్య
3సు॥, 21,4,2001
లలిత-శ్రీనివాస్
అశోక్‌నగర్-గోదావరిఖని

సాయిసిద్ధార్థ
5సు॥,21.4.1998
దుర్గ-గణేష్
అమలాపురం-తూ॥గో॥

ఎన్. ఐక్యత
1సం॥, 22.4.2003
సంతోష-వెంకటేష్
అరుట్ల-రంగారెడ్డి

రాకేష్
1సు॥, 24,4,2003
ఫణీంద్ర-వెంకటేశ్వర్లు
గోవిందపురం-ఖమ్మం

శృతి
2సు॥, 24,4,2002
లక్ష్మీ-చిన్న
పతిపాక-వరంగల్

సాయితేజ
5సు॥, ఏప్రిల్-1999
మంజుల-చంద్రశేఖర్
మిర్యాలగూడ-నల్లగొండ

కె. వరుణ్‌గౌడ్
6సు॥, ఏప్రిల్-1998
భారతి-రామకృష్ణగౌడ్
కొండాపూర్-మెదక్

ఎన్. నాగజ్యోతి
8సు॥, ఏప్రిల్-1996
విజయలక్ష్మి-వెంకటేష్
తాళ్లపల్లి-రంగారెడ్డి

కదమ్
3సు॥, ఏప్రిల్-2001
సాధన-విలాస్
నాంపల్లి-హైదరాబాద్

రవిచంద్ర
9సం॥, మార్చి-1995
రమ-శ్రీనివాసరావు
జమిస్థాన్‌పూర్-హైదరాబాద్

సుమంత్
6సం॥, 22.4.1998
లక్ష్మీ-శ్రీనివాస్

శివరంజని
1సం॥, 19.4.2003
ఉమాదేవి-వెంకటేష్
లాల్‌కోట-మహబూబ్‌నగర్



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



ఆకట్టుకున్న కవర్ స్టోరీ

ఏప్రిల్ 4, 2004 ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ. 'కంప్యూటర్ కోర్సు చేయాలనుకుంటున్నారా' చదివిన తర్వాత మానవుని నిత్యజీవితంలో కంప్యూటర్ ఒక భాగమైపోయింది. పల్లెలకు కూడా సైబర్ కేఫ్‌లు, ఇ-సేవలు విస్తరించి యువత మొత్తం కంప్యూటర్ విద్య పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే అదనుగా భావించి నకిలీ కంప్యూటర్ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, డి.టి.పి. ప్రింటింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్, ఇంజనీరింగ్ కోర్సులు, బేసిక్ కోర్సులు, సంస్థల ఎంపికలో జాగ్రత్తలు అడ్వాన్స్‌డ్ కోర్సుల గురించి పూర్తి సమాచారం తెలుసుకోగలిగాము. కంప్యూటర్ కోర్సు నేర్చుకునే వాళ్ళకు చక్కటి సూచనలు ఇచ్చారు. ఇక ముందు ముందు కూడా ఇలాంటి సూచనలు ఇవ్వగలరు.

– కామిడి సతీష్ రెడ్డి, జడలపేట, వరంగల్ జిల్లా

– డా॥ రాము, ఆర్ఎమ్‌పి, రావులపెంట గ్రామం. నల్గొండ జిల్లా

కవితలు బాగున్నాయి

కళాసాహితిలోని కవితలు 'సంఘర్షణ ఫలాలు, 'కరువో కరువు', 'పంగనామాల పంచాంగం' కళ్ళకద్దినట్లున్నాయి. తెలంగాణా, రాయలసీమ పరిస్థితులు, రైతుల దుస్థితి, పాలకుల పట్టింపులేని చేష్టలు, ఇకనైనా రైతులు పంచాంగం చూచి పొరపడవద్దని హెచ్చరిక పంగనామాల పంచాంగం ద్వారా చాలా చక్కగా సెలవిచ్చారు. జీవనశైలిలో 'ఎంత నంపాదించినా ఏం లాభం?'లో ప్రస్తుత రాజకీయ నాయకుల దిగజారుడు, నీచ నికృష్ట మానవత్వం లేని ప్రజలంటే పామరులని తలచే చేష్టలను, కోట్ల రూపాయలను ఎట్లా దుబారా చేస్తారో బాగా వివరించారు.

– గడీల సుధాకర్‌రెడ్డి,
భారత్‌నగర్, సిద్దిపేట.

రియల్‌స్టోరీ స్ఫూర్తిదాయకం

4 ఏప్రిల్, 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన వికలాంగుల పు(ప)త్రిక. వికలాంగుల కోసం ప్రత్యేక పత్రికను స్థాపించి వారిని, వారి మానసిక స్థితిని అర్థం చేసుకొని వారికి కొండంత అండగా మిగిలిపోవడం నిజంగా జయశ్రీగారికి అభినందనలు తెలుపకతప్పదు. జయశ్రీ లాంటి మంచి మనసున్నవారు ఈ లోకంలో అరుదుగా కనిపిస్తారు.

– మేడూరి సత్యనారాయణ,
శాంతినగర్, తిరువూరు, కృష్ణాజిల్లా

కవర్ స్టోరీ ఉపయోగకరం

4 ఏప్రిల్, 2004 వెలువడిన ప్రజాశక్తి ఆదివారం చాలా బాగుంది. కవర్ స్టోరీ మరువలేనిది. నేటి విద్యార్థులే రేపటి పౌరులు' వారు ఏ ఏ కోర్సులలో చేరితే లాభం కలుగునో, వారు, వారి తల్లిదండ్రులు బాగా అర్థం చేసుకునే విధంగా వివరంగా తెలియపరిచిన మీకు నా అభినందనాలు తెలియజేస్తున్నాను. ఇంకా 'పంగనామాల పంచాంగం', 'కరువో కరువు' చాలా బాగున్నాయి. టూరిస్ట్‌గైడ్ శీర్షికలో 'ఇంద్ర కీలాద్రి' నిలయం గురించి వివరంగా తెలియజేశారు. రచయితలకు, ప్రచురించిన మీకు అందరికీ నా అభినందనాలు.

– షేక్ హసీనా, గద్దిపాడు

కథ బాగుంది



మార్చి 28 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'అమెరికా అమ్మాయి' కథ బాగుంది. ఇకముందు కూడా ఇటువంటి కథల ప్రచురణ చేయగలరని కోరుతున్నాను.

– కలకొండ ప్రభాకర్,
చిమిర్యాల, నల్గొండ.

మనలో మాట

పులిమీద స్వారీ...

పులిమీద స్వారీ చేసే మనిషి-

స్వారీ చేస్తూనే వుండాలి!

ఎట్టి పరిస్థితుల్లోనూ-

పులిమీంచి దిగకూడదు!

భయంకరంగా గాండ్రిస్తుంది! భయపడకూడదు! కైమా చేస్తానని హెచ్చరిక చేస్తుంది! ఖంగారు పడకూడదు!

నువ్వు ఎవడివిరా బాబూ అని ప్రశ్నిస్తుంది!

అవతార పురుషుడనని అబద్ధం చెప్పాలి!

అవును కాబోసని అనుకుంటుంది!

అవతార పురుషుడు కావడం వల్ల తన మీద కూచుని స్వారీ చేస్తున్నాడని భ్రమపడుతుంది!

పులిని ఆ యొక్క భ్రమలోనే వుంచాలి. గండాలెన్ని ఎదురైనా - నా పేరు అప్పలస్వామి అని నిజం మాత్రం చెప్పకూడదు!

గుండెనిబ్బరం చేసుకుని స్వారీ చేయాలి!

అలిసిపోకూడదు - అశ్రద్ధ అస్సలు తగదు!

స్వారీ చేస్తూనే వుండాలి. అమ్మో కష్టమనుకుంటే ఇంతే సంగతులు. పులిచేతుల్లో ప్రాణాలు పోతాయి!

అస్సలు పులితో పెట్టుకోనే కూడదు!

పెట్టుకున్న తర్వాత - స్వారీ మధ్యలో మనసు మార్చుకోకూడదు. బుద్ధి తక్కువై పులిమీద స్వారీ చేయాలనే కోరిక కలిగిందని కంట తడిపెట్టకూడదు!

స్వారీ చేస్తున్న మనిషిని-

పులి ఎప్పటికప్పుడు గమనిస్తూనే వుంటుంది!

అవతార పురుషుడనని అబద్ధం చేప్పేడో...

నిజంగా నిజమే చెప్పేడో తెలుసుకునేందుకు...

అనేకానేక ప్రయత్నాలు చేస్తుంది. గుండెలదిరేలా గర్జిస్తుంది. ఆ గర్జనకు స్వారీ చేసే మనిషి వీసమెత్తుకూడా బెదిరిపోకూడదు!

నోర్మూసుకోమని అతను కూడా గర్జిస్తే - కచ్చితంగా అతను అవతార పురుషుడే అని పులి అతన్ని గట్టిగా నమ్ముతుంది!

రాజకీయం-

ఇంచుమించు పులిమీద స్వారీలాటిదే!

ఎందుకైనా మంచిదని -

ఎన్నికల ముందు గుర్తు చేస్తున్నాను!

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

పరిణామం
కథ... 8, 9

వెన్నెల వర్షం
రియల్‌స్టోరీ... 14, 15

ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారం తూర్పు గోదావరి
టూరిస్ట్ గైడ్ . . . 21

చారిత్రక పరిశోధకుడు 'నశీర్ అహ్మద్'
కళాసాహితి . . . 22, 23

ఔరా!

షావోలిన్ వీరులు

యుద్ధ కళల్లో చైనీయులు అందునా అక్కడి బౌద్ధ భిక్షువులు పూర్వ కాలం నుండి బాగా ఆరితేరి ఉన్నారు. ఇటీవల చైనాలోని సాంగ్సన్ నగరంలోని షావోలిన్ మార్షల్ వీరులు ప్రదర్శన నిమిత్తం అమెరికా వెళ్ళారు. కాలిఫోర్నియాలోని ఒక నగరంలో బౌద్ధ భిక్షువులు ఇచ్చిన ప్రదర్శనతో అమెరికన్లకు నక్షత్రాలు కనిపించాయట! కాలిఫోర్నియా అసెంబ్లీ మాజీ స్పీకర్ హెర్బ్ వెస్సన్ జాంగ్ జియా జూ అనే వీరుడి రెండు కాళ్ళ మధ్య అనేకసార్లు తన బలమంతా ఉపయోగించి (పక్క ఫోటోలో కనిపించే దృశ్యం అదే) కొట్టాడట! అయినా ఆ చైనా వీరుడు అంగుళం కూడా కదల్లేదట! ముఖంలో చిరునవ్వు చెరగలేదట! అతను మనిషో లేక బండరాయో అర్థం గాక అమెరికన్లు బుర్రలు బద్దలు కొట్టుకున్నారట! అందుకే ఇది వార్త అయింది!?

మార్కెట్ మాయాజాలంలో వైద్యులు!



ఇప్పుడు ప్రతీదీ వ్యాపారమే అయిపోయింది. దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో వైద్యులు కూడా తమ గురించి జనానికి చెప్పుకొనేందుకు ప్రచార సంస్థలను ఆశ్రయిస్తున్నారు. లక్షలకు లక్షలు గుమ్మరించి స్పెషలైజేషన్స్ చేసిన వైద్యులు ముంబయి లాంటి మహానగరంలో ప్రచారం లేక రోగులు రాక ఈగలు తోలుకుంటున్నారట! అందుకని కొన్ని ప్రచార సంస్థలు వైద్యుల అర్హతల పట్టిక తీసుకుని ప్రచారం ప్రారంభించాయి. డబ్బున్న దీర్ఘ రోగులకు స్టార్ హోటళ్ళలో డిన్నర్లు ఏర్పాటు చేసి తమ వైద్యుల అర్హతలు, వారి వద్దే వైద్యం ఎందుకు చేయించుకోవాలో ఊదరగొడుతున్నారట! మీకు జబ్బు చేసిందా? అయితే వెంటనే మాకు ఫోన్ చేయండి, మంచి డాక్టర్ అడ్రస్ చెబుతామంటూ ప్రచార సంస్థలు బాకా ఊదుతున్నాయట!

న్యాయం జీవితకాలం లేటు!?

వందల, వేల కోట్లు దిగమింగిన వారు, దేశాన్ని దోచుకుంటున్నవారు అధికార పీఠాలపై కూర్చుని జనాన్ని ఏలుతుండగా, కక్కుర్తి పడి వందో, రెండు వందలో లంచం తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం దొరికిపోయి కటకటాలు లెక్కిస్తున్నారు. వారి కేసుల పరిష్కారానికి జీవితకాలం సరిపోవడం లేదు. వందల కోట్ల రూపాయల విలువైన కుంభకోణాల్లో కూరుకుపోయిన జయలలిత ఏలుబడిలోని తమిళనాడులో 150 రూపాయల లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఒక సర్వేయర్, మరో ఉద్యోగిని 1992లో అరెస్ట్ చేశారు. 1995లో వారిద్దరిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. అరెస్టు చేసిన 12 ఏళ్ళ తర్వాత గత నెలలో ఈ కేసుపై తీర్పు వచ్చింది. 150 రూపాయల లంచం తీసుకున్నట్లు రుజువు కావడంతో సర్వేయర్‌కు ఏడాది జైలు శిక్ష, రు. 400 జరిమానా విధించారు. ఆయన సహోద్యోగి మాత్రం కోర్టు చుట్టూ తిరిగి, మానసిక వేదనతో తీర్పు రాకముందే ఈ లోకం విడిచి పోయాడట! అందుకని కోర్టు ఆయనకు శిక్ష వేయలేకపోయింది.

కార్టూన్ కదంబం



నాకే మీ ఓటు
మీ ఓటు
ఓటు
ఓ
నారు



నీకు సెల్‌ఫోను, నీ ఇంటిమీద నుంచి ఫ్లైఓవర్ వేస్తానంటే కమ్యూనిస్టులు నీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు
ప్రపంచ బ్యాంక్
?

ఓటు

ఢిల్లీ నుండి గల్లీ వరకు..

ఆరు నుండి అరవై సంవత్సరాల వయస్సు వరకు స్త్రీ, పురుష వయోభేదం లేకుండా అందరినీ టీవీల ముందు కట్టిపడేస్తున్న ఆట మన దేశంలో ఒక్కటే... దాని పేరే క్రికెట్. రోజుల తరబడి సా..గే క్రికెట్ పనిలేని వాళ్ళే చూస్తారని గతంలో అనేవారు. ప్రస్తుతం భారతదేశంలో ఏ మూల చూసినా చిన్న పిల్లలు చేతిలో బ్యాటూ, బంతి కనిపిస్తుంది. ఇప్పుడు వీధుల్లో ఆడే ఆట ఇదొక్కటే...

క్రికెట్‌పై ఉన్న మోజును మరింత పెంచి అది ఆడే వారిపై అభిమానం పెంచి తద్వారా తమ వస్తువులను మార్కెట్ చేసుకోవాలన్నది బహుళజాతి సంస్థల ఎత్తుగడ. అది ఫలించింది. పత్రికల్లో, టీవీల్లో క్రికెట్ తారలు కనిపిస్తే చాలు పిల్లలు ఆనందంతో గెంతుతున్నారు. వారి చెప్పింది చేస్తున్నారు. వారు కొనమన్న వస్తువులు కొనే దాకా సతాయిస్తున్నారు. అందుకే క్రికెట్ అంటే ఒక వ్యాపారంగా మారింది. కొందరికి వ్యసనమైంది. ఇక్కడా లాభపడేది బహుళజాతి సంస్థలే. అ లాభంలో కొద్ది భాగం క్రీడాకారులది. భారమంతా ప్రజలదే...

సిరులు కురిపిస్తున్న క్రికెట్

ఎండి హసన్ షరీఫ్, మాధవీ పిల్లే

మన జాతీయ క్రీడ హాకీ. అత్యంత జానాదరణ కలిగిన ఆట మాత్రం క్రికెట్టే. దేశ ప్రజలు క్రికెట్‌పై, క్రికెటర్లపై ఎక్కువగా ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. వారు క్రికెట్ మినహా మరే క్రీడను పట్టించుకోరు. ప్రపంచంలో పన్నెండు దేశాలు మాత్రమే ఆడుతున్న ఈ క్రీడ పట్ల భారత్‌లోనే కాదు ఆసియా ఖండంలోనే అత్యంత ఆదరణ ఉంది. జనాభా కూడా ఆసియా ఖండంలోనే ఎక్కువ. ప్రపంచీకరణలో భాగంగా బహుళ జాతి కంపెనీల కన్ను దశాబ్ద కాలంగా ఆసియా మార్కెట్‌పై పడింది. ఆసియా ఖండంలో జనాభా 200 కోట్లకు పైగా ఉంది. ఇక్కడ తమ ఉత్పత్తులకు మంచి గిరాకీ లభిస్తుందని యూరప్, అమెరికన్ కంపెనీలు భావించాయి. ఆసియాలో ఉన్న దేశవాళీ ఉత్పత్తులను దెబ్బతీసి తమ వస్తువులను పెద్ద ఎత్తున అమ్మేందుకు తేలికైన మార్గాన్ని వెతకనారంభించాయి. అదే సందర్భంలో క్రికెట్ పట్ల ఇక్కడి ప్రజలకు ఉన్న మోజును పసిగట్టాయి. వెంటనే అంతర్జాతీయ క్రికెటర్లకు కోట్ల రూపాయల ఆశ చూపించిన బహుళజాతి కంపెనీలు తమ వస్తువుల ప్రచారానికి వారిని వాడుకోనారంభించాయి. ఆసియాలో భారత్ జనాభా 100 కోట్లకు పైగా ఉంది. ఆసియా మార్కెట్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవాలంటే భారత్ మార్కెట్‌పై ఆధిపత్యం తప్పనిసరి అని బహుళజాతి కంపెనీలు భావించాయి. భారత్ మార్కెట్‌ను తమ గుప్పిట్లోకి తీసుకురావాలంటే ఇక్కడి క్రికెటర్లను ప్రచారానికి వినియోగించుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాయి. దానికి తోడు ఇదే సమయంలో భారత క్రికెటర్లు ప్రపంచ రికార్డులు నెలకొల్పనారంభించారు. దీంతో ఆయా క్రికెటర్ల చిత్రపటాలతో టెలివిజన్‌లలో, సైన్ బోర్డుల ద్వారా బహుళజాతి కంపెనీలు తమ వస్తువులను ప్రచారం చేయనారంభించాయి. ఆ విధంగా అప్పటికే ప్రజల్లో ఆదరణ ఉన్న క్రికెట్‌పై మరింత మక్కువ పెంచుకునేట్లు బహుళ జాతి కంపెనీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమవంతు సహకారం అందించాయి. అందుకే ఒకప్పుడు జంటిల్మెన్ ఆటగా పరిగణింపబడే క్రికెట్ ఇప్పుడు ధనవంతుల క్రీడగా మారింది. క్రికెటర్లు వాడే బ్యాట్ మొదలు వారు వేసుకునే దుస్తుల వరకు పారిశ్రామిక సంస్థలే స్పాన్సర్ చేస్తాయి. క్రికెట్‌బోర్డు లేదా క్రీడాకారుడు వాటికోసం పైసా ఖర్చు చేయక్కర్లేదు. పైగా ఆయా కంఫెనీలకు ఈ సందర్భంగా బ్రహ్మాండమైన ప్రచారం లభిస్తుంది. అందుకు కూడా వారికి సొమ్ము ముడుతుంది. కొంతమందికి డబ్బే ముఖ్యం. అందుకే ప్రమాదకరమైనవిగా గుర్తించిన శీతల పానీయాలకు కూడా వారు ప్రచారం చేస్తారు.

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ)

ప్రపంచంలో అత్యంత ధనవంత క్రీడా సంఘం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ). వివిధ బహుళ జాతి కంపెనీల ద్వారా బిసిసిఐకి ఏటా కోట్ల రూపాయల ఆదాయం లభిస్తోంది. పెప్సీ ద్వారా సంవత్సరానికి 1.02 కోట్ల రూపాయలు బోర్డుకు లభిస్తాయి. భారత క్రికెట్ జట్టు మొత్తానికి సహారా సంస్థ స్పాన్సర్ చేస్తోంది. భారత జట్టు స్వదేశంలో కానీ, విదేశాల్లో కానీ ఎక్కడ టెస్ట్ మ్యాచ్ ఆడినా ప్రతి ఆటగాడికి ప్రతి టెస్ట్‌మ్యాచ్‌కు 2.5 లక్షల రూపాయలను సహారా చెల్లిస్తుంది. ఇందులో ఆటగాళ్లు 60 శాతం,



బిసిసిఐకి సంవత్సరపు ఆదాయం

పెప్సీ ద్వారా--------1.02 కోట్లు
సహారా ద్వారా--------67 లక్షలు
టివి హక్కుల ద్వారా--------10.5 కోట్లు
ఒక టెస్ట్‌మ్యాచ్ వాణిజ్య ప్రకటనల ద్వారా----------1 కోటి
ఒక వన్డేమ్యాచ్ వాణిజ్య ప్రకటన ద్వారా--------65 లక్షలు

బిసిసిఐ ఆదాయం అలా వుంచితే దాని ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఇటీవల దేశవాళీ క్రికెట్ ఆటగాళ్ల జీత భత్యాలు రెట్టింపు చేసింది. రంజీ, దులీప్, దియోధర్, ఇరానీ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నమెంట్లతో పాటు జూనియర్ టోర్నమెంట్లను కూడా బోర్డు నిర్వహిస్తుంది. జూనియర్ ఆటగాళ్లకు భత్యాలు పెంచింది. ప్రతి జోన్‌కు కోచింగ్ సెంటర్ల ద్వారా కోచింగ్ ఇవ్వడానికి అయ్యే ఖర్చును కూడా బోర్డే భరిస్తుంది. అంపైర్ల, స్కోరర్ల భత్యాలను పెంచి, వారికి ప్రయాణపు ఛార్జీల స్థాయి కూడా పెంచింది. వీటన్నిటితో పాటు ఆర్థికంగా ఇక్కట్లలో ఉన్న మాజీ ఆటగాళ్లకు, అకస్మాత్తుగా మృతిచెందిన ఆటగాళ్ల కుటుంబాలకు ధన సహాయాన్ని బిసిసిఐ చేస్తోంది.

బిసిసిఐ 40 శాతం పంచుకుంటాయి. సహారా ద్వారా బిసిసిఐకి సంవత్సరానికి దాదాపు 67 లక్షల రూపాయల రాబడి ఉంటుంది.

అతి ముఖ్యమైన టెలివిజన్ హక్కులను అమ్మడం ద్వారా బిసిసిఐకి అత్యధిక రాబడి వస్తుంది. ఇటీవల భారత్-పాకిస్తాన్‌ల మధ్య జరిగిన సిరీస్ ప్రసార హక్కులను టెన్ స్పోర్ట్స్‌కు ఇవ్వడం ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు 200 కోట్ల రూపాయలు సంపాదించడం నమ్మశక్యం కాని నిజం. భారత్‌లో జరిగే టెస్ట్‌మ్యాచ్‌లు, వన్డేలతో పాటు బిసిసిఐ నిర్వహించే ప్రతి మ్యాచ్‌ను ప్రసారం చేసే హక్కును ప్రసార భారతికి ఇచ్చారు. దీంతో బిసిసిఐకి ప్రసార భారతి సంవత్సరానికి 10.5 కోట్ల రూపాయలు చెల్లిస్తుంది. అయితే ప్రసార హక్కులను మళ్లీ వేలం వేయాలని బిసిసిఐ నిర్ణయించడంతో రాబోయే కాలంలో టెలివిజన్ ప్రసార హక్కుల అమ్మకం ద్వారా బిసిసిఐకి దాదాపు 22 కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. స్టేడియంలో వాణిజ్య ప్రకటనల ద్వారా కూడా బిసిసిఐకి ఆదాయం లభిస్తుంది. అంతర్జాతీయ మ్యాచ్‌లకు టికెట్లు అమ్మడం ద్వారా కూడా బోర్డుకు ఆదాయం లభిస్తుంది. టెస్ట్‌మ్యాచ్‌లకు, వన్డే మ్యాచ్‌లకు వాణిజ్య ప్రకటన రేట్లు వేర్వేరుగా ఉంటాయి. మ్యాచ్ తిలకించే వారికి టికెట్ల రేట్లు కూడా వన్డేలకు, టెస్ట్‌మ్యాచ్‌లకు వేర్వేరుగా వుంటాయి.

భారత క్రికెట్ జట్టు సంవత్సరానికి కనీసం ఎనిమిది టెస్ట్‌మ్యాచ్‌లు, 30 వన్డే మ్యాచ్‌లు ఆడుతుంది. ఒక్కొక్క టెస్ట్‌మ్యాచ్ ద్వారా కనీసం కోటి రూపాయలు, ఒక్కొక్క వన్డే మ్యాచ్ ద్వారా 65 లక్షల రూపాయలు బోర్డు ఖజానాకు చేరుతుంది. భారత దేశంలో జరిగే టెస్ట్, వన్డే మ్యాచ్‌లకు సహారాతో పాటు పెప్సీ కో స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోంది. దీంతో క్రికెట్ మ్యాచ్‌లు జరిగే ప్రాంతాల్లో ఆ కంపెనీ పెట్టే హోర్డింగ్‌లు, వాళ్ల ఫుడ్ ప్రొడక్ట్స్ ద్వారా మరింత ఆదాయం లభిస్తుంది.

అత్యధిక సంపాదన పరులు ఎవరు?

దేశంలో అత్యధికంగా సంపాదించే ఆటగాళ్లు నిస్సందేహంగా క్రికెటర్లే. అత్యధిక రాబడి గల భారత ఆటగాళ్లలో తొలి పది స్థానాల్లో నిలిచిన వారు క్రికెటర్లు కావడం విశేషం. బోర్డు నుండి మ్యాచ్ ఫీజులు, బోనస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు కాకుండా అదనంగా వీరి కాంట్రాక్ట్‌లపై వాణిజ్య ప్రకటనలతో, కొన్ని కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తూ తమ రాబడిని పెంచుకుంటున్నారు.

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి)

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) పేరు ప్రపంచ కప్-2003 సమయంలో ప్రముఖంగా వినిపించింది. ఇంతకు ఐసిసి ఏం చేస్తుంది? దీని పరిధి ఏమిటి? అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ గవర్నింగ్ బాడీ అంతర్జాతీయ టెస్ట్, వన్డే మ్యాచ్‌లకు పర్యవేక్షకురాలిగా వ్యవహరిస్తుంది. ప్రపంచంలో క్రికెట్‌ను విస్తరించే బాధ్యత కూడా ఐసిసిదే. విస్తరణలో భాగంగా అసోసియేటెడ్ మెంబర్‌షిప్ దేశాల ద్వారా, అనుబంధ సభ్యుల ద్వారా క్రికెట్‌ను అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపచేస్తుంది.

విస్తరణలో భాగంగా విదేశాలలో ఆడే జట్లకు ప్లేయింగ్ కండిషన్, అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్‌లు నిర్వహించడం ఐసిసి పని. ఐసిసి ప్రపంచ కప్, ఐసిసి నాకౌట్ టోర్నమెంట్, అసోసియేటెడ్ సభ్య దేశాలకు ఐసిసి టోర్నమెంట్, ఇటీవల జూనియర్ స్థాయి ఆటగాళ్ల అభివృద్ధికై అండర్-19 ప్రపంచ కప్ పోటీలను నిర్వహిస్తుంది.

దీనితో పాటు అంతర్జాతీయ స్థాయిలో వివిధ జట్ల మధ్య విభేదాలు లేకుండా వుండాలని తటస్థ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలను ఐసిసి నియమిస్తుంది. వివిధ సమస్యల పరిష్కారానికి పలు కమిటీలను వేస్తుంది. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ప్రవర్తనా నియామవలిని రూపొందించే బాధ్యతను కూడా ఐసిసి తీసుకుంటుంది.

ఐసిసి నిర్వహించే ఇతర బాధ్యతలలో అవినీతి నిర్మూలన, వివిధ దేశాల్లో క్రికెట్ అభివృద్ధి, వివిధ జట్ల పర్యటన షెడ్యూల్ రూపొందించడం, టోర్నమెంట్‌ల తేదీలు ప్రకటించడం, టెస్ట్, వన్డే ఛాంపియన్ షిప్ ట్రోఫీలు, మ్యాచ్ రిఫరీ, అంపైర్ల నియామకం, ప్రవర్తనా నియమావళి, అతిక్రమించిన వారికి జరిమానా, శిక్ష వగైరా.

ఐసిసి పుట్టుపూర్వోత్తరాలు

జూన్ 15, 1909లో క్రికెట్ (టెస్ట్) మ్యాచ్‌లు ఆడుతున్న దేశాలలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా,

అతిఖరీదైన బహుమతి

ఈ కారు ఖరీదు 70 లక్షల రూపాయలు. ఇటలీకి చెందిన ఒక కంపెనీ సచిన్ టెండూల్కర్‌కు బహుమతిగా పంపించింది. సచిన్ దీన్నికి చెల్లించాల్సిన దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకున్న కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత ఉపసంహరించుకుంది. చివరకు బహుమతిగా పంపించిన కంపెనీయే సుంకాన్ని కూడా చెల్లించింది. ఇంత కష్టపడి ఉచితంగా స్వంతం చేసుకున్నా సచిన్ ఆ ఫెరిరా కారులో విహరించడానికి దానికి వాడే ప్రత్యేకమైన పెట్రోల్ మనదేశంలో లభ్యం కాదు. ఈ ఒక్క కారు కోసం ప్రత్యేకంగా ప్లాంట్ నెలకొల్పి దానికవసరమైన పెట్రోల్ తయారు చేయడానికి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ నిర్ణయించింది. క్రికెట్ క్రీడాకారులంటే కంపెనీలకు ఎంత భక్తి, మోజు ఉన్నాయో తెలుసుకోవడానికి ఇదే నిదర్శనం.

ఎవరి ఆదాయం ఎంత?

వన్డేల్లోనూ, టెస్టుల్లోనూ రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తన బ్యాటింగ్ మాయాజాలంతో దేశంలోనే కాదు ప్రపంచంలోనే కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. అత్యధిక ప్రజాదరణ కలిగిన సచిన్ రాబడి కూడా అందరు ఆటగాళ్లకంటే ఎక్కువే.

40 కోట్లు

సచిన్ ఏడాదికి 40 కోట్ల రూపాయలు మాత్రమే సంపాదిస్తాడు! సచిన్‌కు బూస్ట్, పెప్సీ, ఎయిర్ టెల్, అడిడాస్, టివిఎస్, వీసాకార్డ్స్, టుడేస్ పెన్, ఎన్ఇసిసి, బ్రిటానియా, ఎంఆర్ఎఫ్, ఇఎస్‌పిఎన్-స్టార్‌స్పోర్ట్స్, వరల్డ్ టెల్ వంటి కంపెనీలు సచిన్ పేరును ప్రచారం చేసుకుంటూ తమ వస్తువుల గిరాకీని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఫలితంగా సచిన్‌కు కోట్ల రూపాయలను ముట్టచెప్తాయి. సచిన్‌కు సంవత్సరానికి ఇఎస్‌పిఎన్-స్టార్ టెలివిజన్ 11 కోట్లు, అడిడాస్ ఆరు కోట్లు, ఎయిర్ టెల్ నాలుగు కోట్లు చెల్లిస్తాయి.

10 కోట్లు

రెండవ స్థానంలో సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రావిడ్ (ఒక్కొక్కరికీ 10 కోట్ల ఆదాయం) ఉన్నారు. పెప్సీ, శ్యామ్‌సంగ్, సహారా, బ్రిటానియా, హీరోహోండా, హిమామి సోనాచాందీ, నెస్లే తదితర కంపెనీలు సౌరవ్ గంగూలీని ప్రచారానికి వినియోగిస్తున్నాయి. క్యాస్ట్రాల్, కిషాన్, పామోలీవ్, రీబాక్, హచ్ కంపెనీలు ద్రావిడ్‌ను తమ ప్రచారానికి వాడుకుంటున్నాయి.

5 కోట్లు

తర్వాత స్థానం డ్యాషింగ్ బ్యాట్స్‌మన్ వీరేందర్ సెహ్వాగ్‌ది. అతని రాబడి 5 కోట్ల రూపాయలు. రిలయన్స్ ఇన్ఫోకాం, శ్యామ్‌సంగ్, కోకకోలా, బ్రిటానియా, హీరోహోండా, ఆపిస్, బూస్ట్ వగైరాలకు సెహ్వాగ్ ప్రచారం చేస్తాడు.



1 కోటి

ఐదవ స్థానంలో నిలిచిన హైదరాబాద్ స్టార్ బ్యాట్స్‌మన్ వివిఎస్ లక్ష్మణ్ రాబడి కోటి రూపాయలు. ఇతడు రేబాన్, పెప్సీ, బ్యాంక్ ఆఫ్ పంజాబ్, రాయల్ స్టాగ్, శ్యామ్‌సంగ్ వగైరా కంపెనీలకు ప్రచారం చేస్తాడు.

పార్థివ్

జహీర్

ఆ తరువాత స్థానంలో వరుసగా వెటరన్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే, అజిత్ అగార్కర్, జహీర్ ఖాన్, పార్థివ్ పటేల్, వన్డే స్పెషలిస్టులు మహ్మద్ కైఫ్, యువరాజ్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్ తదితరులు ఉన్నారు. భారత క్రికెట్ జట్టు తరఫున ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ ఆడినా అతడు కోట్ల రూపాయలు సంపాదించినట్లే. అందుకే అంతర్జాతీయ జట్టులో స్థానం కోసం సెలెక్టర్లకు లక్షల రూపాయల ముడుపులు చెల్లించుకోవడానికి కూడా రంజీ ఆటగాళ్లు వెనకాడడం లేదు.

కైఫ్

మార్కెటింగ్ ఏజెంట్లు భారత క్రికెట్ జట్టులోని ప్రముఖ ఆటగాళ్లకు వాణిజ్య ప్రకటనలను సమకూరుస్తున్నారు. మినిమం గ్యారంటీ ప్రాతిపదికన సచిన్ టెండూల్కర్‌కు ఐదు సంవత్సరాలకు గాను 100 కోట్ల రూపాయల మినిమం గ్యారంటీని వరల్డ్ టెల్ అనే సంస్థ ఇచ్చింది. గంగూలీ, ద్రావిడ్‌లకు 45 కోట్ల రూపాయల మినిమం గ్యారంటీ ఇచ్చింది.

క్రికెటర్లకు బోర్డు ద్వారా లభించే వేతనాలు

- ప్రతి టెస్ట్‌మ్యాచ్‌కు ఒక్కో ఆటగాడికి 2.5 లక్షలు.
- ఒక్కొక్క వన్డే మ్యాచ్‌కు ప్రతి ఆటగాడికి 3.25 లక్షలు.
- ఆటగాళ్ల ప్రయాణపు ఖర్చులు, స్టార్ హోటల్ వసతి, రోజువారీ భత్యం వగైరా ఖర్చులను కూడా క్రికెటర్లకు బోర్డు ఇస్తుంది.
- జట్టులో రెగ్యులర్‌గా సంవత్సరం పాటు ఆడిన ఆటగాడి గత సంవత్సరం వన్డే ఆదాయం 67.5 లక్షలు.
- గత సంవత్సరం రెగ్యులర్‌గా టెస్ట్ ఆడిన ఒక్కొక్క ఆటగాడికి దాదాపు 20 లక్షలకు పైగా లభించాయి.
- అదనంగా టోర్నమెంట్ ప్రైజ్‌మనీలో అందరికీ వాటా లభిస్తుంది.
- బిసిసిఐకి సహారా కంపెనీ చెల్లించే మొత్తంలో 60 శాతం డబ్బును ఆటగాళ్లు పంచుకుంటారు.
- అద్భుత ప్రతిభ కనబర్చిన ఆటగాడికి కొన్ని కంపెనీల నుండి బోనస్ లాంటి కానుకలు లభిస్తాయి. కో స్పాన్సర్స్ చేస్తున్న కంపెనీ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్ లేదా వ్యక్తిగత రికార్డు స్థాపించిన ఆటగాడికి, లేదా బౌలర్ ఐదు వికెట్లు తీసుకున్న బౌలర్ లేదా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసిన ఆటగాడికి అదనంగా నజరానా లభిస్తుంది.

దక్షిణాఫ్రికా వున్నాయి. ఈ మూడు దేశాలు కలిసి ఇంపీరియల్ క్రికెట్ కాన్ఫెడరేషన్ స్థాపించాయి. ఈ గవర్నింగ్ బాడీలో టెస్ట్‌మ్యాచ్‌లు ఆడే దేశాలను సభ్యులుగా తీసుకోవాలని నిర్ణయించారు. 1926లో భారత్, న్యూజిలాండ్, వెస్టిండీస్‌లకు పూర్తి సభ్యత్వం లభించింది.

ఐసిసిని స్థాపించడంలో దక్షిణాఫ్రికా కీలకపాత్ర పోషించింది. అయితే వర్ణ వివక్షతను పాటిస్తున్నందున ఆ దేశం సభ్యత్వాన్ని 1961లో నిషేధించారు. 1990లో దక్షిణాఫ్రికాపై నిషేధం ఎత్తివేయడంతో 1991లో మళ్లీ సభ్యత్వం కల్పించారు.

1965 వరకు ఇంపీరియల్ క్రికెట్ కాన్ఫెడరేషన్ పేరుతో ఉన్నా (ఐసిసి) కొత్త పేరుతో చలామణీలోకి వచ్చింది. అదే ఇంటర్నేషనల్ క్రికెట్ కాన్ఫెడరేషన్. 1965లో కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. బ్రిటిష్, కామన్ వెల్త్ వంటి దేశాలు ఎన్నికలలో పాల్గొనడమే కాక పోటీ చేయవచ్చునని నిర్ణయించారు. దీనితో అసోసియేటెడ్ మెంబర్స్‌కు ఒక్క ఓటు, పూర్తి సభ్యత్వం ఉన్న దేశాలకు ఒక్కొక్కరికి రెండు ఓట్లు, స్థాపించిన దేశాలకు వీటో చేసే హక్కు వుంటుందని కొత్త నిబంధనలు తెలియజేశాయి.

ఐసిసిలో ప్రస్తుతం 27 మంది అసోసియేటెడ్ సభ్యులు వున్నారు. దీనితో పాటు అఫిలియేషన్ సభ్యత్వం వున్న 52 దేశాలు కూడా వున్నాయి. అఫిలియేషన్ మెంబర్స్ ఐసిసి సమావేశాలకు, ఓటింగ్, ప్రపోజ్, సెకండ్ చేయడం వరకే పరిమితం. 1989లో ఐసిసి ఇంటర్‌నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌గా పేరు మార్చుకుంది. 1993లో తొలిసారి ఐసిసి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను నియమించారు. తొలి ఐసిసి అధ్యక్షుడిగా ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ రిచర్డ్స్‌ను నియమించారు. కొత్త కార్యాలయం ఇంగ్లండ్‌లోని లార్డ్స్ మైదానంలో నెలకొల్పారు. 2001లో మాల్కం స్పీడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వున్నారు. ప్రస్తుతం పాకిస్తాన్‌కు చెందిన ఎహసాన్ మని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఉన్నారు. ★

కథ



పరిణామం

శ్రీచరణ్‌మిత్ర

బోనులో పడిన తనకు క్రమక్రమంగా దూరం అవుతున్న అడవిని తలుచుకుని దీనంగా అరిచిందా పులి. 'తనను ఏ మరచి, మోసగించి, బలవంతంగా బంధించి తీసుకుపోతున్న ఈ మానవ మృగాల్ని నేనేమీ చేయలేనా భగవంతుడా' అంటూ నిట్టూర్చసాగింది. ఆ రోదన, వేదన వినిపించుకోకుండా అడవికి చాలా దూరం అయిపోయానన్న విషయం అర్థమై – "తప్పదు. తను పూర్తిగా ఈ మానవుడి పైశాచిక బలం ముందు ఓడిపోయాను" అనుకుంది.

పులి మౌనంగా కన్నీరు కార్చసాగింది.

* * *

కళ్ళముందే ఎండిపోయిన తన పొలాన్ని చూశాక దుఃఖం ఆగలేదు చంద్రయ్యకు. రెండు సంవత్సరాలుగా నీటిచుక్క భూమిని తాకలేదు. భూమాతలో నీరు పూర్తిగా ఇంకిపోయింది. దూరంగా అక్కడెక్కడో ఉన్న జలాన్ని కొద్దిగానైనా తీసుకువచ్చే నీటి పంపులకు కరెంటు అందక అందొచ్చిన కొడుకు అందని లోకాలకు వెళ్ళిపోయినట్టు తన కళ్ళముందే పంట అంతా నాశనమైపోయింది.

"ఇక ఈ ఊళ్ళో ఉండి ఏం చేయాలి? పెళ్ళాం బిడ్డలు ఆకలితో నకనకలాడిపోతున్రు. ఏ కంపో, కర్రో కొట్టి పూట గడుపుకున్నా.... ఆ పాటి పనికి ఇంటి యజమానే అవసరం లేదు. ఇంట్లో ఆడోళ్ళే ఆ పని సేసుకోగల్రు. పట్నం ఎల్లి పోవాలి" అనుకున్నాడు చంద్రయ్య.

మొన్నటి రేతిరేల ఎమ్మెల్యే బాబు సెప్పిండు. సర్కారోళ్ళ పనులు ఏవీ అంత తొందరగా జరగవురా, అక్కడెక్కడో గోదారి జలాలు మన పంటలకి రావాలంటే అంత ఈజీగా జరుగుతాయా.... ఆ భగవంతుడికే మన మీద జాలి లేదు వాన చినుకును రాల్చడం లేదు. అలాంటప్పుడు చెడ్డరోజులొచ్చినాయని సచ్చిపోతావేటి? వచ్చే ఏడు కూడా నాకు ఓట్లేత్తే... మన ఊరి సమస్యను గురించి ప్రత్యేకంగా అసెంబ్లీలో మాట్లాడతాను" అన్నాడు బాపినీడుగారు

"ఇప్పుడు మా ఆకలి తీరిసే మార్గం సూపండయ్యా" అన్నాడొక బక్కరైతు.

బాపినీడు భారత రాజకీయ నాయకుడి భంగిమల్లో రకరకాలుగా ఆలోచించాడు. ఆ హావభావాల్లో రకరకాల భంగిమలు ప్రదర్శించాక – 'ఆఁ... మీ కష్టాలను ఆదుకునే మార్గం నాకు కనిపించినాది. ఎంతయినా మీరు నా నియోజకవర్గపు ప్రజలు. మిమ్మల్ని, మీరు నమ్ముకున్న వాళ్ళని రక్షించడం నా కర్తవ్యం కనుక మా అబ్బాయి పట్నంలో నడుపుతున్న కార్ఖానాల్లో మనోళ్ళకు ఇంటికి ఒకర్ని పనిలో వేయిస్తాను.... సుబ్బరంగా పని సేసుకోండి' అన్నాడు. జనాల్లో కొద్దిగా కదలిక మొదలైంది.

ఉన్న ఊరిని... తాము నమ్ముకున్న పల్లె తల్లిని విడచి ఎక్కడికో పనికి వెళ్ళాలంటే వాళ్ళకు అసంబద్ధంగా తోచింది. తమ తాతల దగ్గర నుండీ, అదే ఊళ్లో ఉంటూ, అక్కడే మన్నైపోయిన వారికి మల్లే తమ బతుకులు కూడా అక్కడే తెల్లారిపోతాయనుకుంటే... ఇక్కడ ఇంకేమిటో జరుగుతోంది. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"ఒరేయ్, వెర్రి నాగన్నలూ... నిజానికి ఈ పల్లెటూళ్ళని పట్టుకుని మనోళ్ళంతా ఏడుస్తారుగానీ, పట్నంలో బోలెడు పనులుంటాయిరా... దర్జాగా కాలుమీద కాలేసుకుని బతకొచ్చు. అదృష్టం బాగుంటే గవర్నమెంటు ఉజ్జోగాలు వచ్చినా రావొచ్చు. మనూళ్ళో రాంబాబుగాడు, నాగిరెడ్డిగాడు పట్నం పోయి మంచి ఉద్యోగాలు సంపాదించారు కదా? ఏం సెక్రట్రీ:.." అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు బాపినీడు.

"చిత్తం... చిత్తం" అంటూ తలూపాడు సెక్రటరీ.

* * *

బోనులో ఉన్న పులి ఆకలితో నకనకలాడిపోతూ... నీరసించిపోయిన దేహంతో పడి ఉంది. తన రాజసం అంతా గత కాల వైభవం కాగా, గతిమాలిన బ్రతుకైన ఆ పులి వద్దకు, జంతు శిక్షకుడు ఒకడు తన శిష్యులతో వచ్చాడు. అతని చేతిలో ఒక మాంసం ముక్క ఉంది. ఆకలితో వున్న పులికి నోరూరింది. దీనమైన ముఖంతో "నాకు ఆకలిగా ఉంది ఏమైనా పెట్టవా" అని అడిగింది. శిక్షకుడు విలాసంగా నవ్వాడు – 'మృగరాజు లాంటి పులి తనను అభ్యర్థించే స్థితికి తీసుకువచ్చిన తన తెలివి తేటలకు తానే మురిసిపోయాడు.

"నీకీ మాంసపు ముక్క కావాలంటే నీవు నా ఆజ్ఞలను పాటించాలి" అన్నాడు.

"పులి వేరొకరి ఆజ్ఞలను పాటించదు" అంది పులి దాదాపు గాండ్రిస్తున్నట్లుగా

"అయితే ఆకలితో చస్తావ్... జస్ట్ ఈ బోనులోనే నేను 'స్టార్ట్' రడీ అనగానే ఆ చివగి నుండి ఈ చివరకు నడుస్తూ... నేను స్టాప్ అన్నప్పుడు ఆగిపోవాలి అంతే" అన్నాడు.

పులి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన రాజసం ఒకసారి గుర్తుకు వచ్చింది. అయినా ఆత్మాభిమానాన్ని ఆకలి జయంచింది. 'అలాగే' అన్నట్టు తలూపింది.

* * *

నేను రమ్మన్న వెంటనే వచ్చార్రా. అదే మీకు శ్రీరామరక్ష. కంపెనీలో పని కావాలంటే చిన్న తతంగం జరపాల... మనోడే అయిన వెంకటరావు సెప్పినట్లు మీరంతా మరో కంపెనీ ముందు ధర్నా చెయ్యాల. తెర వెనక నుండి నేను కథంతా నడిపిస్తాను. మనకు సానుకూలంగా పరిస్థితి వచ్చినాక నేను రంగంలో దిగుతాను. అప్పుడు మీరు నాకు మద్దతు తెలుపుతూ ఊరేగింపులు, ధర్నాలు సెయ్యాల" అన్నాడు బాపినీడు.

చంద్రయ్యతో సహా మిగతా రైతులందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

పొలాల్లో మట్టి పిసుక్కుని బతికేవోళ్ళం. మాకేదో పని సూపెడతానన్నారు. మాకీ తతంగాలన్నీ ఏం తెలుసు బాబయ్యా" అన్నాడు సింహాచలం అనే రైతు.

"తప్పదయ్యా... ఇక్కడ ఉపాధి దొరకాలంటే చెప్పులరిగేట్టు తిరగాల. మేం చెప్పినట్టు అరవాల" అన్నాడు బాపినీడు కాస్త కసిరినట్లుగా...

'అలాగే' అంటూ తలలు దించారు.

* * *

'ఈ రోజు నేనొక స్పెషల్ ఐటం చెయ్యాలి' అన్నాడు శిక్షకుడు.

'ఏమిటి?' అన్నట్టుగా చూసింది పెద్దపులి.

చెప్పాడు శిక్షకుడు. ఒక్కసారిగా ఉలిక్కిపడింది పులి. 'ఇది మరీ అన్యాయం' అంది.

'ఆలోచించుకో నీకు కావాల్సిన ఆహారం నా దగ్గర ఉంది. దానికో ధర ఉంది. నేను చెప్పినట్టు చేస్తేనే ప్రతిఫలంగా నీకు తిండి ఉంటుంది. మరీ మూర్ఖంగా నీ తలబిరుసుతో నా ఆజ్ఞలను ధిక్కరిస్తున్నావు కనుక ఈ రోజు నీకు భోజనం లేదు" అంటూ శిక్షకుడు నిర్దాక్షిణ్యంగా...

పులికి ఆహారం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు. బోనులో పులి నిరాశగా నిలుచుని చూస్తూ నిలబడిపోయింది.

* * *

ఇంతమందికి పనులంటే ఎలా కుదురుతుంది నాన్నా... ఎక్కడి నుండి తెస్తాం?" ఆవేశంగా అడిగాడు ఎమ్మెల్యే కుమారుడు సురేష్..

వికటంగా నవ్వాడు బాపినీడు "అందరికీ ఉపాధి చూపలేక గవర్నమెంటోళ్ళే చేతులెత్తేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ఫ్యాక్టరీలో మనుషుల్నేసుకోవడానికి నేనేం ఎర్రివాడినా... తొందరలో మనకు లోక్‌సభలో సీటు ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు మనకు మనుషులు అవసరం చాలా ఉంది. అందాక ఈల్లని మనం ఏదో విధంగా మేపక తప్పదు. తరువాత ఏం చేయాలనే ఆలోచన నాకు వేరే ఉంది. నువ్వేం భయపడమాకు" అంటూ అభయం ఇచ్చాడు.

తండ్రి ఏం చేసినా బాగా ఆలోచించి చేస్తాడని సురేష్‌కు తెలుసు. అందుకనే ఏం మాట్లాడకుండా ఉండిపోయాడు. నిజం చెప్పాలంటే తన ఫ్యాక్టరీ బ్రహ్మాండంగా నడుస్తోంది. మంచి లాభాలే ఉన్నాయి.

* * *

నిరాశపడ్డ కళ్ళు, ఆకలితో అలిసిన శరీరంతో తన దగ్గరకు వచ్చిన శిక్షకుడి కేసి దీనంగా చూసింది పులి.

"ఈ పాటికి నీవు బాగా ఆలోచించుకుని ఉంటావనుకుంటాను. నా ఆజ్ఞలను తు.చ. తప్పక పాటించడానికి సిద్ధమయ్యావని ఆశిస్తున్నాను. ఏమంటావు?" అని అడిగాడు శిక్షకుడు.

పులి ఏం మాట్లాడలేదు.

"మౌనం అంగీకార సూచన అనుకోమంటావా! ఆకలి ఈ పాటికి నీకు అదుపు ఆజ్ఞల విషయాలను బాగా తెలియజేసిందనుకుంటా" అంటూ విలాసంగా నవ్వేడు.

"పులిని... నాకు గాండ్రించడమే తెలుసు... నీవు మరీ అన్యాయంగా గాడిదలా అరవమంటున్నావు... ఇది నీకు న్యాయం కాదు" అంది పులి చిన్నబుచ్చుకుంటూ.

పకపకా నవ్వేడు శిక్షకుడు.

"కాలం కలిసి రానపుడు... ఆటవికం రాజ్యమేలినపుడు ఆజ్ఞలను పాటించక తప్పదమ్మా... కమాన్... క్విక్" అంటూ పులిని వేగిర పరిచాడు శిక్షకుడు.

పులి మళ్ళీ అతని ఆదేశాన్ని పాటించడానికి సిద్ధమైంది.

* * *

పల్లె నుండి తీసుకువచ్చిన జనాలకు బాపినీడుగారి ఫ్యాక్టరీ వద్ద గాకుండా, ఇతర ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాయడంలోనే పెద్ద పని అయిపోయింది.

ఎవరెవరో గేటు దగ్గర జెండాలు పాతేసి... నిరుపేదలకు.. న్యాయం జరగాలని నినాదాలు ఇచ్చేస్తున్నారు. వారితో పాటు వీరూ అరుస్తున్నారు. పూటకొక నాయకుడు హామీ ఇచ్చేస్తున్నాడు. రెడీమేడ్ నాయకులంతా ఆందోళన చేసేస్తున్నారు.

అసలు ఫ్యాక్టరీలో ఏవేవో కారణాల వలన నలుగురైదుగురిని. యాజమాన్యం పని ఆపినందుకు.. పల్లెటూరి నుండి వచ్చిన తామంతా ఎందుకు ధర్నాలు చేయాలో చంద్రయ్యలాంటి వారికి అర్థం కాలేదు.

అయినా ఏవేవో తమకు తెలియని.... అర్థం కాని అరుపులు అన్నీ అరుస్తున్నారు.

ఈ అరుపుల్లో నుండే అవతలి యాజమాన్యం దిగివచ్చి వాళ్ళని పనిలోకి తీసుకునే వరకూ తాను పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టనని శపథం చేసేశారు బాపినీడు గారు.

ఈ గొడవ ముదిరి ఎక్కడెక్కడికో వెళ్ళిపోతుందని, అసలు కొంపకే ఎసరు వస్తుందని భావించి, యాజమాన్యం ఆ తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకుంది.

'కార్మిక బంధు బాపినీడు' అని ఫ్యాక్టరీ కార్మికులు కీర్తించాక, పట్టుదలతో కార్మికులకు ఉపాధి కల్పించిన ఎం.ఎల్.ఏ. బాపినీడు అంటూ పత్రికలు పతాక శీర్షికల్లో ప్రచురించాయి.

కార్మిక బంధువుగా ఖ్యాతి గడించిన ఆ నాయకుడు ఒక నాలుగు నెలల పాటు తాను పల్లె నుండి తెచ్చిన జనాలతో తన కంపెనీలో పని చేయించుకుని... తరువాత తన కొడుకుతో వారిని తొలగింపు చేసి... మరో కొత్త నాటకానికి తెర తీశాడు.

అంతకుముందు తాను పక్క ఫ్యాక్టరీలో జరిపిన తతంగాన్నే మళ్ళీ తన మనుషులతో జరిగేలా ఏర్పాటు చేశాడు.

సమ్మె ఉధృతమైంది.



తమ మనుష్యులే ఇప్పుడు తమ ఫ్యాక్టరీకే వ్యతిరేకంగా నినాదిలిచ్చేలా చూశాడు. మొత్తం మీద మనుషులు... అతను అరవమన్నట్టల్లా అరిచేలా చేసుకున్నాడు.

* * *

శిక్షకుడు రాగానే ఉత్సాహంగా పైకి లేచింది పెద్దపులి.

వచ్చిన వెంటనే అతను నేర్పించిన విధానంలోనే శిక్షకుడికి శాల్యూట్ చేస్తూ – "ఊఁ ఆకలిగా ఉంది... నువ్వు వేగంగా ఆర్డరు చెప్పు... నేను రడీగా ఉన్నాను" అంది.

శిక్షకుడు తన శిష్యులకేసి గర్వంగా చూసి... "పులి మన ఆదేశాలను పూర్తిగా పాటించడానికి సిద్ధమైపోయింది చూశారా... ఇక మనం ఆట్టే శ్రమ పడకుండానే మనం చెయ్యమన్నట్టల్లా చేస్తుంది. ఎలా ఉంది నా ట్రయినింగ్" అన్నాడు మెరిసిన కళ్ళతో. శిష్యులంతా అతనికేసి ప్రశంసాపూర్వకంగా చూశారు.

కంపెనీ వద్ద ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు జరుగుతున్న విషయం పత్రికల్లో ప్రముఖ విషయమైపోయింది. ఆందోళనలో భాగంగా ఎవరెవరో దిగిపోతున్నారు మళ్ళీ. తొలగించిన కార్మికులకు న్యాయం చెయ్యాలంటూ అందరూ కోరుతుండగా – వారినందరిని ఎలా దెబ్బకొట్టాలో ఆలోచించిన బాపినీడు అర్జెంటుగా ఒకరోజు ప్రెస్‌మీట్ పెట్టి, "పేద ప్రజలకు ప్రతినిధి అయిన తాను, తన కొడుకు అధీనంలో ఉన్న ఫ్యాక్టరీలో తన ప్రజలకు ఇంత అన్యాయం జరుగుతున్నందుకు చలించిపోతున్నానని సెలవిచ్చి, తాను ఇంతకాలం ఆరోగ్యం బాగులేక విదేశాలలో ఉండటం వలన ఈ విషయం తెలియలేదని, వచ్చినాక ఈ విషయం తెలిసి చాలా కలత చెంది... తొలగించిన వారినందరినీ మళ్ళీ పనిలోకి తీసుకునే వరకూ పచ్చి మంచినీళ్ళు ముట్టనని తన కొడుకుతో అన్నందుకు... తన పంతం చూసి వారినంతా పనిలోకి తీసుకోవడానికి అంగీకరించాడనీ... ఆ విషయం చెప్పడానికే ఇలా ప్రెస్ మీట్ పెట్టానని" చెప్పాడు.

అంతే మళ్ళీ జిందాబాద్‌లూ, జయజయ ధ్వానాలతో బాపినీడు గారు భారత రాజకీయాలకు భావి మార్గదర్శకుడు అయిపోయాడు.

పత్రికలు ఆయనను 'ప్రజాబంధువు' అని కీర్తించాయి..

ఫ్యాక్టరీ కార్మికులు 'కార్మిక బంధువు' అన్నారు.

ప్రజలు పట్టిన పట్టు వీడని 'ఉక్కుమనిషి'గా భావించారు.

ఫలితంగా బాపినీడు గారు అధికార పక్షంలో తనకు కావాల్సిన సీటు సునాయాసంగా సంపాదించేశాడు.

* * *

"ఈ వేళ నేనొక ఉపన్యాసం ఇస్తాను... ఉపన్యాసం ముగియగానే నీవు మెచ్చుకొన్నట్లు చప్పట్లు కొట్టాలి" అని శిక్షకుడు పులి సమాధానం కోసం ఎదురు చూడకుండానే ఆయన తన శిష్యులవైపు తిరిగి ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"ప్రస్తుతం దేశం వెలిగిపోతోంది. ఆ వెలుగులో మనమంతా పేదరికం లేని దేశాన్ని నిర్మించుకోవాలి. ఆ విధంగా మనమంతా ముందుకు పోతూవున్నాం. ఏటా కోటి ఉద్యోగాలతో... కోరికలు కూడా లేని స్థితప్రజ్ఞతను మనం పొందగలుగుతున్నాం... కనుక మనమంతా రేపటి ఉషోదయం కోసం... అంతా చెవిలో పువ్వులను ధరించి... సైకిళ్ళపై షికారు చేయడానికి సిద్ధంగా ఉండమని కోరుకుంటూ ఉన్నాను" అన్నాడు.

'నీ ఉపన్యాసంలో నాకు తలా తోక అర్థం కాలేదు' అంది పెద్దపులి.

"నీకు అర్థం అయిందా, లేదా అని నిన్నెవడు అడిగాడు. నేను చెప్పినట్లు నోర్మూసుకుని విని చప్పట్లు కొట్టడమే నీపని" అంటూ కోపంగా ఉరిమి చూశాడు శిక్షకుడు.

"క్షమించండి" అంది పెద్దపులి తలదించుకుంటూ.

* * *

"ప్రతీ ఏటా ఫ్యాక్టరీకి వరుసగా నష్టాలు వస్తున్నాయి. అందుకని నేను ఫ్యాక్టరీని ఇంకొకరికి

(మిగతా 15వ పేజీలో)

అంపశయ్య నవీన్

పూర్ ఇండియన్స్

"ఐదారు రోజులుగా కనిపించడమే లేదు..."

"ఊర్లో ఉంటేగద కనిపించడానికి?"

"ఎక్కడికెళ్లావు?"

"మరో ప్రపంచంలోకెళ్ళిపోయాను"

"మరో ప్రపంచమంటే... కొంపదీసి చంద్రమండలానికేమన్నా వెళ్ళొచ్చావా ఏమిటి?"

''ఇంచుమించుగా అక్కడికే వెళ్ళొచ్చినట్టయింది."

"ఏమిటి కథ?"

"చాలా కాలంగా అమెరికాలో ఉంటున్న ఓ దగ్గరి మిత్రుడు ఇండియాకొచ్చాడు...."

"వస్తే?"

"వచ్చినప్పట్నించీ ఆయన నన్నొక్కక్షణం కూడా వదిలిపెట్టకుండా ఆయనతోటే తిప్పుకున్నాడు."

''ఓహో! అమెరికా రుచి నీక్కూడాచూపించాడా?"

"చూపించాడు గదా! ఆయనిక్కడున్నన్ని రోజులూ హైదరాబాద్‌లోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో ఉన్నాడు."

"అదేమిటి? ఆయనకిక్కడ బంధువులెవరూ లేరా?"

"ఎందుకులేరు? వాళ్ళ అమ్మా, నాన్న, తమ్ముళ్లు, చెల్లెళ్ళూ, బావలూ, బావమరుదులూ... అందరూ ఉన్నారు."

"వాళ్ళ ఇళ్ళల్లో ఉండొచ్చు కదా!"

"ఆయన అప్పుడప్పుడు అద్దెకు తీసుకున్న ఓ ఏ.సి. కార్లో వెళ్ళి వాళ్ళను కలిసొచ్చే వాడేగానీ, వాళ్ళ ఇళ్ళల్లో మాత్రం ఉండటానికొప్పుకోలేదు."

"ఎందుకో?"

"ఎందుకో ఏమిటి? మన ఇండియన్స్ ఉండే ఇళ్ళుగానీ, ఆ ఇళ్ళ పరిసరాలుగానీ ఏ మాత్రం శుభ్రంగా ఉండవట. అందుకని ఎవరింట్లో ఉన్నా ఏదన్నా ఇన్‌ఫెక్షన్ అవుతుందని తెగ భయపడిపోయాడు. అందుకే వాళ్ళ బంధువులెందరో ఎంత బలవంతపెట్టినా వాళ్ళ ఇళ్ళల్లో ఒక్కరోజైనా ఉండలేదు."

"కనీసం వాళ్ళ ఇళ్ళల్లో భోజనమైనా చేశాడా?"

"లేదు. భోజనం కూడా చెయ్యలేదు. ఇండియన్స్ ఇళ్ళల్లో ఏం తిన్నా, ఏం తాగినా, ఇన్‌ఫెక్షన్ అవుతుందట... అందుకని ఫైవ్‌స్టార్ హోటల్లో తప్ప ఆయన ఎక్కడా ఏమీ తినలేదు. రెప్యూటెడ్ కంపెనీ వాళ్ళ మినరల్ వాటర్ తప్ప, వేరే నీళ్ళు తాగలేదు. ఆయనకు అనుక్షణం ఇన్‌ఫెక్షన్ అవుతుందన్న భయమే! ఫైవ్‌స్టార్ హోటల్లో అయితే ప్రతీది స్టెరిలైజ్ చేస్తారట... అందువల్ల ఇన్‌ఫెక్షన్ భయం ఉండదట."

"నువ్వు కూడా ఆయనతోపాటు ఈ పది రోజులూ ఫైవ్‌స్టార్ హోటల్లోనే ఉన్నావా?

"చచ్చినట్టు"

"చచ్చినట్టేమిటి? ఫైవ్‌స్టార్ హోటల్లో ఉండటమంటే స్వర్గంలో ఉన్నట్లని చెప్పుకుంటారే!"

"నాకైతే నరకంలో ఉన్నట్టనిపించింది."

"ఎందుకో?.."

"మాఫ్రెండ్ అమెరికా నుండి మొన్న ఫిబ్రవరిలో వచ్చాడు. మనకప్పటికింకా చలికాలం పోలేదు. చలికాలంలో ఏ.సి.రూమ్స్‌లో ఉండాలంటే నాకైతే ఓ శిక్షలాగానే అనిపిస్తుంది. ఆయనకేమో రక్తం గడ్డకట్టేంత చలికావాలి. నాకేమో ఆ చలికి వణుకొచ్చింది. ముక్కు ఊపిరితిత్తులూ మూసుకుపోయాయి. ఆయన అమెరికా వెళ్ళిపోయాక, ఓ పదిహేను రోజుల దాకా నన్ను దగ్గూ, పడిశం వదల్లేదంటే నమ్ము!"

"ఫైవ్‌స్టార్ హోటల్లో తిండి బావుంటుందా?"

"ఏం బాగో! నేనైతే ఏమీ తిన్లేకపోయాను... "బఫేలంచ్" అని ఓ ఇరవై ముప్పై ఐటెమ్స్ పెడ్తారు. మనమే వెళ్ళి వడ్డించుకోవాలి... ఆ ఇరవై ముప్పై ఐటెమ్స్‌లో దేన్ని సెలక్ట్ చేసుకోవాలో తెలిసిచావదు... ఏదో ఒకటని వడ్డించుకుంటాం... దాంట్లో ఉప్పుంటే కారం ఉండదు. కారం ఉంటే ఉప్పుండదు. నాకైతే ఏదీ రుచించలేదు. అది కొంచెం, ఇది కొంచెం వడ్డించుకొని తింటాం... కానీ ఏది తిన్నా మనం మన ఇంట్లో తినే తిండిలా కడుపు నిండదు. నాకా పది రోజులూ, కడుపునిండా ఎప్పుడూ తిన్నట్టే లేదు..."

"భోజనానికి బిల్లెంతో?"

"బిల్లులు చూస్తే మతిపోతుందనుకో... ఇద్దరం భోం చేస్తే దాదాపు వెయ్యి రూపాయల బిల్లు... ప్యాకింగ్!..."

"రోజుకు ఆ హోటల్లో రూమ్ రెంటెంతో?"

"రోజుకు ఐదు వేలు... ఆయన పది రోజులున్నాడు కదా... హోటల్ రూమ్‌రెంటే యాభై వేలు దాటింది... లంచ్‌లకూ, డిన్నర్లకూ కలిసి మరో ముప్పైవేలు... అప్పుడప్పుడు "జానీవాకర్"లాంటి విస్కీలకు మరో నలభైవేలు... ఆయన కోసం కొందరు ఫ్రెండ్స్, బంధువులూ వస్తుండేవాళ్ళు.. వాళ్ళ కోసం కూడా డ్రింక్స్, డిన్నర్లూ అరేంజ్ చేసేవాడు. ఆయన ఇక్కడున్న ఆ పదిరోజుల్లో ఓ లక్షన్నర దాకా ఖర్చు పెట్టేయడం చూస్తోంటే నాకు దిమ్మ తిరిగిపోయిందనుకో!"

"ఒకప్పుడు ఇతడూ పేదవాడే, అమెరికాకు వెళ్ళి బాగా సంపాదించాడు.. ఇప్పుడాయనకు ఇండియన్స్ అందరూ పేదవాళ్ళుగానే, అంటరానివాళ్ళుగానే కనిపిస్తున్నారు... మాటమాటకూ "పూర్ ఇండియన్స్! రెచ్ఛెడ్ ఇండియన్స్" అనేవాడు..."

★

దానిమ్మపండు

కె. సాహిల్

చైనాలో అదొక బుల్లి గ్రామం. ఆ ఊరి చివర బోలెడన్ని కొండలు వున్నాయి. వాటి పక్కన ఓ మట్టి ఇల్లు వుంది. అందులో ఇద్దరు అన్నదమ్ములు వుండేవారు. వాళ్లకు ఒక ఎద్దు వుంది. వాళ్లకున్న ఆస్తి అంతా అదే.

అన్నదమ్ముల్లో చిన్నవాడికి ఆ ఎద్దు అంటే బోలెడంత ఇష్టం. ప్రతిరోజూ చాలా దూరం వెళ్లి దానికోసం గడ్డి కోసుకొచ్చేవాడు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా గడ్డి కోసుకుని ఇంటికి చేరాడు చిన్నవాడు. అప్పుడు అన్నయ్య 'తమ్ముడూ.... నువ్వు పెరిగావు. పెద్దవాడివయ్యావు. అందుకని మనిద్దరం విడివిడిగా వుందాం' అన్నాడు. ఆ మాటలు విని తమ్ముడు చాలా బాధపడ్డాడు. ఏడ్చాడు. కాని అన్నయ్య బలవంత పెట్టడంతో అయిష్టంగానే సరేనన్నాడు.

విడిపోయి బతకాలంటే ఆస్తిపాస్తులు కూడా పంచుకోవాలి కదా. పెద్దవాడు తెలివిగా 'తమ్ముడూ! మనకు ఒక్కటంటే ఒక్కటే ఎద్దు వుంది. దాన్ని నేనే ఎందుకు తీసుకోకూడదు?' అన్నాడు.

చిన్న తమ్ముడికి అది ఏ మాత్రం ఇష్టం లేదు. కాని 'నేను ఎంతో ప్రేమించే ఎద్దుని రెండు ముక్కలు చెయ్యలేం. ఎవరో ఒకరం తమ భాగాన్ని వదులుకోవాల్సిందే. అందుకని నేనే నా భాగాన్ని కూడా అన్నయ్యకు ఇచ్చేస్తాను' అనుకున్నాడు.

పెద్దవాడు సంతోషంగా ఎద్దుని తీసుకెళ్లాడు. పాత మట్టి ఇల్లు, పశువుల దగ్గర వుండే జోరీగ మాత్రం చిన్నవాడికి మిగిలాయి. పాపం ఆ జోరీగనే ఎంతో ప్రేమగా చూసుకోసాగాడు.

ఓ రోజు చిన్నతమ్ముడు తన బాబాయి వాళ్ల ఇంటికి వెళ్లాడు. వాడు ఆదమరచి వున్నప్పుడు... బాబాయివాళ్ల కోడిపుంజు ఆ ఈగను గుటుక్కున మింగేసింది. దాంతో వాడు గుండె పగిలేలా ఏడ్చాడు. ఎందుకంటే వాడికి ఆ ఈగ తప్ప ఇంక ఎవరూ లేరు కదా. అప్పుడు వాళ్ల పిన్ని వచ్చి 'కన్నా! ఎందుకు ఏడుస్తున్నావు?' అని అడిగింది.

అప్పుడు చిన్నవాడు ఎక్కిళ్లు పెడుతూ 'మరి... మరి... నేను మా అన్నయ్య విడిపోయాం కదా. అప్పుడు వాడేమో ఎద్దును తీసుకున్నాడు. నాకు జోరీగ మాత్రం మిగిలింది. దాన్ని కాస్తా మీ కోడిపుంజు తినేసింది' అని చెప్పాడు బాధగా. వాడి భుజాన చేతులు వేసి ప్రేమగా నిమురుతూ 'ఏడవకమ్మా! నీకు మా కోడిపుంజును ఇస్తాగా' అంది. అది చాలా అందమైన కోడిపుంజు. చిన్నవాడు దాన్ని ఎంతో ఇష్టంగా చూసుకునేవాడు. అప్పటినుంచి వాళ్లు ఇద్దరూ ఎప్పుడూ కలిసే వుండేవారు.

చలికాలం వచ్చింది. మంచు విపరీతంగా పడుతోంది. చలిగాలులుకూడా బాగా వీస్తున్నాయి. దీంతో మట్టి ఇల్లు కూలిపోయింది. చిన్నవాడికి, కోడిపుంజుకు తలదాచుకోవడానికి చోటే లేకుండా పోయింది. అప్పుడు వాడు ఎంతో ఆలోచించి దగ్గరలోవున్న తాత ఇంటికి వెళ్లాడు.

కోడిపుంజును వదిలిపెట్టి చిన్నవాడు ఏదో పనిలో వున్నాడు. ఆ క్షణంలో తాత పెంచుకునే పసుపుపచ్చకుక్క కోడిని తినేసింది. దాంతో వాడు ఎంతో విచారించాడు. చాలాసేపు ఏడుస్తూనే వున్నాడు. అది చూసి ఎందుకు ఏడుస్తున్నావని అడిగాడు తాత. 'మీ కుక్క మా కోడిపుంజును తినేసింది' అన్నాడు కళ్ల నీళ్లు తుడుచుకుంటూ.

అప్పుడు తాత 'ఏడవకమ్మా నీకు దాని బదులు మా కుక్కను ఇస్తాను. తీసుకెళ్లువుగాని' అన్నాడు. వాడు పసుపుపచ్చ కుక్కను తీసుకుని ఇంటికి చేరాడు. చలికాలం వెళ్లిపోయింది. రైతులు పొలాలు దున్ని, గింజలు చల్లసాగారు. కాని చిన్నవాడు మాత్రం విచారంగా చూస్తూ వుండిపోయాడు. ఇదంతా గమనించిన కుక్క చాలా దయగా 'నీ దగ్గర ఎద్దులు లేవు కదా. పొలం దున్నడానికి నేను సహాయం చేస్తాను' అంది. కుక్క మాట్లాడినందుకు, పొలం దున్నుతానన్నందుకు వాడు ఎంతో ఆశ్చర్యపోయాడు. సంతోషించాడు.

మరునటిరోజు చిన్నవాడు కుక్కను తీసుకుని పొలం వెళ్లాడు. పసుపుపచ్చకుక్క చాలా వేగంగా దున్నింది. ఎంత బాగా అంటే ఎద్దులకంటే చురుగ్గా పొలం అంతా దున్నేసింది. ఓ రోజు పెద్దవాడికి పసుపుపచ్చ కుక్క విషయం తెలిసింది. తమ్ముడిని కలుసుకుని మారకం వేసుకుందామన్నాడు. తన ఎద్దును తీసుకుని కుక్కను ఇవ్వమని అడిగాడు. ఇష్టం లేకపోయినా చివరకు అంగీకరించాడు చిన్నవాడు.

మరునాడు ఉదయాన్నే పెద్దవాడు కుక్కను తీసుకుని పొలం వెళ్లాడు. కాని కుక్క పొలం దున్నడానికి అస్సలు అంగీకరించలేదు. అయితేనేం దాన్ని భయపెట్టి, కొట్టి సాయంత్రం వరకు పొలం దున్నించాడు. మధ్యలో విరామం లేకపోవడంతో అది స్పృహ తప్పి పడిపోయింది.

(చైనా జానపద కథ. ముగింపు వచ్చే ఆదివారం)



ఈ బొమ్మలో ఏముంది?

హేయ్! ఇవాళ మీకోసం ఓ వెరైటీ బొమ్మ తీసుకొచ్చాం. చూసి అది ఏంటి? అందులో ఏమున్నాయి? ఎవరెవరున్నారు? గబగబా చెప్పాలి. ఇంతసేపా? 'అబ్బో! వెరైటీ బొమ్మ అంటే ఏంటో అనుకున్నాం. ఇదా. పుర్రె బొమ్మ చూపించి మా గొప్ప బడాయి పోతున్నారే. పైగా దాని నెత్తిమీద ఒక కిరీటంలాగా పెట్టారు. భలే వాళ్లే' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ మీకు మరో అవకాశం ఇస్తున్నాం. మీరు జాగ్రత్తగా చూసి చెప్పాలి. తర్వాత అయ్యో! మేం అలా చూడలేదే. ఇలా చూడలేదే' అని ఆశ్చర్యం ప్రకటించకూడదు. చూశారా? చెప్పండి చెప్పండి ఏం కనిపించింది. మళ్లీ అదేనండీ. పుర్రె మినహా మాకు మరేం కనిపించడంలేదు' అంటున్నారు కొందరు. ఇంకొందరేమో. 'అవునండీ మీరు చెప్పింది నిజమే. మాకు బాగా చూస్తే ఓ అమ్మాయి కనిపించింది. ఇంక ఏవేవో వున్నాయికానీ స్పష్టంగా తెలీడంలేదు' అంటున్నారు. చివరిగా చెప్పిన చిన్నారులు సమాధానం సరైనది. అదో గది. ఆ గదిలో ఓ అమ్మాయి. అద్దం ముందు కూర్చుని తయారవుతోంది. చుట్టూ చీకటి వుంది. ఇప్పుడు మేం చెప్పాక అవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయా? అదే మరి పరిశీలనా శక్తిని పెంచుకోవాలంటే వినిపించుకోరు!!



చిన్నారి చిత్రకారులు

జి.చైతన్య, 6వ తరగతి, జెడ్‌పిఎస్‌ఎస్, వెంకటాపురం, ఖమ్మం.

ఎ.ప్రమోద్‌కుమ... 1వ తరగతి, వెలిమినేడు, నల్గొండ.



కె.నవీన్‌కుమార్, 7వ తరగతి, జెఎన్‌ఎమ్‌హెచ్ స్కూల్, మంగళవరపుపేట, పెద్దాపురం.

ఎన్.రవి, 6వ తరగతి, శ్రీవీర్రాజు హైస్కూల్, చల్లావారివీధి, పెద్దాపుం.

రంగులు వేద్దామా!

క్విజ్-5

1. మన రాష్ట్రంలో అతి పెద్ద ఓడరేవు ఏది?

ఎ. విశాఖపట్నం బి. చీరాల

2. జీవనదులని వేటిని పిలుస్తాము?

ఎ. హిమాలయాలలో పుట్టిన నదులను

బి. ఎడారులలో పుట్టిన నదులను

3. నవ గ్రహములు ఎన్ని?

ఎ.తొమ్మిది బి.ఎనిమిది

4. విమానాలు ఏ వాతావరణ పొరలో ప్రయాణిస్తాయి?

ఎ.అయినో బి. స్ట్రాటో

5. నీటిని నిల్వ వుంచే గుణం వున్న నేలలు ఏవి?

ఎ. ఇసుక నేలలు బి. నల్లరేగడి నేలలు

6.చార్మినార్ నిర్మించిన సంవత్సరం?

ఎ. 1591 బి. 1592

7. అంబేద్కర్ పూర్తి పేరు?

ఎ. భీంరావు రాంజీ అంబేద్కర్ బి. భీంరావు అంబేద్కర్

8. కోడి గుడ్లను ఎన్ని రోజులు పొదుగుతుంది?

ఎ. 21 రోజులు బి. 31 రోజులు

9. పొడవు × వెడల్పు = ?

ఎ. దీర్ఘ చతురస్ర వైశాల్యము

బి. చతురస్ర వైశాల్యము

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?

ఎ. హరికిషన్ సింగ్ సూర్జిత్

బి. కరుణానిధి

క్విజ్ 4కు జవాబులు

1.ఇగ్లూలు 2. గ్రాఫైట్ 3. రవీంద్రనాథ్‌టాగూర్ 4.1931 మార్చి 23 5. శాశ్వత దంతాలు 6. 1350 గ్రాములు 7. సరి సంఖ్యలు 8. విశ్వనాథన్ ఆనంద్ 9. యూరీగగారిన్10. మాకినేని బసవపున్నయ్య

క్విజ్ 3కు సరైన సమాధానాలు రాసిన వారు :

పి.విమల, 6వ తరగతి, **పి.కమల,** 7వ తరగతి, **ఎం.మనోహర్, 5**వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, విజయవాడ. **ఎల్.విజయలక్ష్మి,** 10వ తరగతి, **ఎల్.వెంకాయమ్మ,** 9వ తరగతి, గవరపాలెం. **వి.వరుణ్‌కుమార్,** 5వ తరగతి, రెంటచింతల, గుంటూరు. **పి.లక్ష్మి, 9**వ తరగతి, **సి.కాంచన, 7**వ తరగతి, గోనెగండ్ల, కర్నూల్.

కలం స్నేహం

పేరు:ఎస్.రోషన్ జమీర్,
వయసు : 11 సం॥
చదువు :4వ తరగతి
హాబీలు : ప్రజాశక్తిలో క్విజ్ ప్రశ్నలకు జవాబులు రాయడం, చదవడం, క్యారమ్స్, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా: ఎస్.రోషన్ జమీర్, సన్నాఫ్ ఖసీర్ అహ్మద్, జ్ఞానోదయ స్కూల్, కరీమ్‌దివాన్ నగర్, ఆదోని.

పేరు: ఎ.శ్రీరామ్,
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు :క్రికెట్ ఆడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా :ఎ.శ్రీరామ్, సన్నాఫ్ ఎ.భాస్కరరావు, 8వ తరగతి, ఆంధ్ర పబ్లిక్ స్కూల్, హరి పాలెం, విశాఖ-531033.

కొంగ-ఎండ్రకాయ

యమునాతీరంలోని సుందరవనంలో ఓ మర్రిచెట్టు వుండేది. దానికిందే వున్న పుట్టలో ఓ పాము నివశిస్తుండేది. అది చెట్టు మీదున్న కాకి జంట పెట్టే గుడ్లను ఎప్పటికప్పుడు తింటుండేది. అప్పుడు పాపం కాకులు ఎంతగానో దుఃఖించేవి. ఒకరోజు మగకాకి తన స్నేహితుడైన నక్కతో తమ బాధను చెప్పుకుంది. అప్పుడు నక్క ఇలా అంది."పూర్వం ఒక కొంగ కొలనులోని చేపలతోపాటు ఎండ్రకాయలను కూడా తినాలనుకుంది. అప్పుడు ఎండ్రకాయ ఉపాయంతో కొంగను చంపి ప్రాణాలను కాపాడుకుంది. అలాగే నువ్వు కూడా శత్రువును అంతం చేయాలి" అంటూ ఆ కథను చెప్పసాగింది.

బదరికావనంలో ఒక కోనేరు వుంది. దాని నిండా చేపలున్నాయి. ఒక కొంగ వాటిని ఎలాగైనా తినాలనుకుని కోనేటి ఒడ్డుకు వెళ్లింది. ఒంటి కాలిపై నిలబడి కళ్లు మూసుకుని జపం ప్రారంభించింది. తన దగ్గరకు వచ్చిన చేపలను చూసి కూడా చూడనట్లు నటించసాగింది. అక్కడే నివసిస్తున్న ఎండ్రకాయ కూడా కొంగను ఆశ్చర్యంగా చూసింది. "కొంగబావా! కాళ్ల దగ్గరకు వచ్చిన చేపలను కూడా పట్టుకోకుండా వదిలేస్తున్నావేంటి?" అని అడిగింది. "పీతబావా! ఈ మధ్య ఒక మహాత్ముడు నాకు జ్ఞానబోధ చేశాడు. జీవహింస చేస్తే నరకం తప్పదన్నాడు. జీవులన్నింటినీ ప్రేమతో చూసేవారికి స్వర్గసుఖాలు లభిస్తాయని చెప్పాడు. ఇంతకాలం అనేక పాపాలు చేశాను. ఇప్పుడు పాప పరిహారం కోసం అహింసా వ్రతం పూని ఇక్కడ జపం చేస్తున్నాను" అంది.

కొంగ దొంగ జపం చేస్తోందని గ్రహించలేక ఎండ్రకాయ కొంగతో స్నేహం చేసింది. ఒకనాడు వెక్కి వెక్కి ఏడుస్తున్న కొంగను చేపలు చూశాయి. దాని దగ్గరకు వెళ్లి, "కొంగబావా! ఏమయింది? ఎందుకలా ఏడుస్తున్నావు?" అని అడిగాయి.

పంచతంత్ర కథలు

"స్నేహితులారా! ఏం చెప్పమంటారు? నిన్న కోనేరు దగ్గరకు కొంతమంది జాలరులు వచ్చారు. మరో పదిరోజుల్లో ఈ చెరువు ఎండిపోతుంది. అప్పుడు వలలు వేస్తే కోకొల్లలుగా చేపలు మనకు చిక్కుతాయి - అని వారు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఆ మాటలు విన్నప్పటి నుండి నాకు దుఃఖం ఆగడం లేదు. కొద్దిరోజుల్లోనే



మీకు నేను దూరం కాబోతున్నానని నాకు చింతగా వుంది" అంది కొంగ దొంగ ఏడుపు ఏడుస్తూ. ఆ మాటలు నిజమని నమ్మిన చేపలు భయపడ్డాయి. "కొంగబావా! ఈ కష్టంలో మమ్మల్ని నువ్వే కాపాడాలి." అంటూ ఆ చేపలు బతిమిలాడాయి. తన పాచిక పారినందుకు కొంగ లోలోపల ఎంతగానో ఆనందించింది.

"మిత్రులారా! ఇక్కడికి పది మైళ్ల దూరంలో ఒక చెరువు వుంది. మండు వేసవిలోనైనా అందులో నీరు నిండుగా వుంటాయి. మీకు ఇష్టమైతే మిమ్మల్ని నా ముక్కుతో కరచుకుని పోయి ఆ చెరువు దగ్గర విడుస్తాను" అంది కొంగ. చేపలు ఒప్పుకున్నాయి.పది రోజులు కాగానే కొంగ ఒక్కొక్క చేపను ముక్కున కరచుకొని బయలుదేరింది. ఆ చేపలను ఒక కొండ మీద పెట్టి సుష్టుగా భోంచేసింది. ఆ విధంగా చెరువులో వున్న చేపలన్నింటిని ఆరగించింది. చెరువులో ఇంకా ఏమైనా చేపలు మిగిలిపోయాయేమోనని వెతుకుతున్న కొంగ దగ్గరకు ఎండ్రకాయ వచ్చింది.

'కొంగ బావా! చిన్నప్పటి నుంచి చేపలతో కలిసి జీవించిన నేను ఇక్కడ ఒంటరిగా వుండలేను. నన్ను కూడా తీసుకుపో!" అంది ఎండ్రకాయ. ఎండ్రకాయ మాంసం బలే రుచిగా వుంటుందని తెలిసిన కొంగ దాన్ని కూడా చంపి తినాలనుకుంది."అలాగే పీతబావా! నీ డెక్కలతో నా మెడ పట్టుకో. నిన్ను ఆ చెరువు దగ్గరకు తీసుకువెళతాను" అంది కొంగ. ఎండ్రకాయ ఆ విధంగానే చేసింది.

కొంగ చేపలను తిన్న స్థలానికి చేరుకుంది. అక్కడ పడివున్న చేపల పొలుసులను ఎండ్రకాయ చూసింది."చుట్టుపక్కల ఎక్కడా నీళ్లు లేవు. ఈ కొంగ చేపలను కొండ మీదకు తెచ్చి తినేసి వుంటుంది. నన్ను కూడా అలాగే తినాలనుకుని ఇక్కడకు తీసుకొచ్చింది. మోసగాళ్లతో బుద్ధిమంతుడు మోసంగానే ప్రవర్తించాలి. దీనికి తగిన శాస్తి చేయాలి!" అనుకుంది ఎండ్రకాయ. వెంటనే తన డెక్కలతో కొంగ మెడను కత్తిరించింది. నక్క ఈ కథంతా కాకికి చెప్పి, "కాబట్టి నువ్వు కూడా ఏదైనా ఉపాయం ఆలోచించి నీ శత్రువైన పామును చంపు" అంది.

రియల్ స్టోరీ

వెన్నెల వర్షం

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్

వెన్నెల వర్షం కురుస్తోంది.

పుచ్చపువ్వులాంటి వెన్నెల పూర్తిగా పరచుకుంది.

ఆకాశంలో వెలుగుతున్న చంద్రుడ్ని దాటుకుంటూ మబ్బు తునకలు ముందుకు సాగిపోతున్నాయి.

రైలు పట్టాలపైన వెన్నెల ప్రతిఫలిస్తోంది.

గుబురు వృక్షాలపైన తెల్లటి దుప్పటి కప్పేయగా చెట్ల సందుల్లోంచి పడుతున్న వెన్నెల కిరణాలు వింతరంగును కలిగిస్తున్నాయి.

పున్నమిరాత్రి నక్షత్రాల్ని కూడా వెలిగిస్తోంది.

మహమ్మద్ శమీమ్ మేడపైన కూర్చుంది.

దూరంగా వినిపిస్తున్న రైలు కూత గుండెల్లో అదోలాంటి అలజడి కలిగిస్తూ ఫాసినేటింగ్‌గా అనిపిస్తోంది. రాత్రిపూట నిశ్శబ్దాన్ని చీల్చుకుని శబ్దాన్ని తెరలు తెరలుగా వ్యాపింపజేస్తూ దూసుకువచ్చే రైళ్ళంటే ఆమెకు ఎంతో ఇష్టం..

తండ్రి రాజ్‌మహమ్మద్ రైల్వేస్టేషన్ డ్యూటీకి వెళ్ళాడు. తల్లి రెండ్రోజుల క్రితమే అమ్మమ్మ ఇంటికి వెళ్ళింది.. ఇంటిలో చెల్లెళ్ళిద్దరూ పడుకున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రైల్వే క్వార్టర్లలో ఇనుప స్తంభాలతో దడిగా కట్టిన ఆ క్వార్టరు అంటే శమీమ్‌కు ఎంతో ఇష్టం... ఇంటి పై కప్పు ఎక్కి వచ్చిపోయే రైళ్ళను చూడడం మరీ ఇష్టం.... వెన్నెల్లో వంటరిగా కూర్చుని కనుచూపు మేరలో అంతమయ్యే రైలు పట్టాల వెంబడి చూస్తూ చిన్న చుక్కలాంటి వెలుగుతో ముందుకు దూసుకు వచ్చే రైళ్ళను చూడడం అంటే ఇంకా ఇంకా ఇష్టం.

అందుకే వెన్నెల కోసం శమీమ్ చూస్తుంది.

రైల్వే స్టేషన్‌లో ఏదో రైలు ఆగింది.

దూరం నుంచి ప్రయాణీకుల మాటలు.. అమ్మకందారుల అరుపులు... అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఈ ట్రైను వెళ్ళిపోతే నాన్న డ్యూటీ పూర్తవుతుంది–" అనుకుంది శమీమ్.

అలా అనుకోగానే తండ్రి గుర్తుకు వచ్చాడు.

కష్టం లేకుండా పెంచిన అతని ప్రేమ గుర్తుకు వచ్చింది. ట్రైను వెళ్ళిపోయినా ఇంకా రాలేదేమిటా అని టైము గుర్తుకు వచ్చింది.

ఎంతయిందో తెలీదు.

ఆడపిల్లలందరూ పెట్టుకునే అందమైన చిన్న రిస్టువాచీ తనకెంతో ఇష్టం... ఎన్నో టీవీ సీరియళ్ళలో ఆడవాళ్ళ చేతుల్ని, వారు ధరించే రకరకాల గడియారాలను గమనించేది. అయినా తనకు గడియారం పెట్టుకునే యోగ్యత లేదని గుర్తుకు వచ్చి గొంతులో ఏదో తెలియని బాధ మెలితిరిగినట్లయింది.

దుఃఖం తన్నుకు వచ్చింది.

రెండు చేతులూ లేని తన అవిటితనం తలచుకుని మనసు బాధగా మూలిగింది... అందరిలా తను ఎందుకు పుట్టలేదు? రెండు చేతులూ లేకుండా తనకు భగవంతుడు అంత పెద్ద శిక్ష విధించాడు మనసులోనే అనుకుంది.

అలా అనుకోవడం శమీమ్‌కు ఎన్నోసారో గుర్తుకు రాలేదు. కానీ జీవితంలో దినచర్యల్లో జరిగే అన్ని సంఘటనల్లో తనకున్న వైకల్యం ఆమెకు ఎప్పుడూ గుర్తుకు వస్తూనే ఉంటుంది. మనసులో బాధ సుడులు తిరుగుతూనే ఉంటుంది.

ఆకాశంలో వెన్నెల మాయమైంది.

శమీమ్ తలెత్తి ఆకాశం వైపు చూసింది. నల్లని పెద్ద మేఘం చంద్రుడి మీదుగా పరుగులు తీస్తోంది. రెండు నిమిషాల్లో మళ్ళీ వెన్నెల వెలుగు వస్తుందన్నమాట అనుకుంది.

ఇంతలో బూట్ల చప్పుడు వినిపించింది. ఆ వెంటనే "బేటా! శమీమ్ కిందకు రా!" తండ్రి మృదువైన పిలుపు వినిపించింది.

మహమ్మద్ శమీమ్ ఈ లోకంలోకి వచ్చింది.

మెల్లగా కిందకు దిగింది.

"ఏం చేస్తున్నావు? వెన్నెల్ని చూస్తున్నావా?" తండ్రి ప్రేమగా అడిగాడు.

"లేదు నాన్నా! వెన్నెల్లో స్నానం చేస్తున్నాను!" కవితాత్మకంగా చెప్పింది.

రాజ్ మహమ్మద్ బిగ్గరగా నవ్వాడు. తర్వాత "నువ్వు చాలా తెలివైన దానివమ్మా!" అంటూ స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

తండ్రి వచ్చేంత వరకు శమీమ్ డైనింగ్ టేబుల్ వద్ద కూర్చుంది. తండ్రి అక్కడికి రాగానే –" అమ్మ రేపేనా వస్తుంది?" ప్రశ్నించింది.

"అవును..." అంటూ రెండవ కూతురు చేసిన వంటను జాగ్రత్తగా పళ్ళెంలో పెట్టుకున్నాడు. ఫ్రిజ్‌లో ఉన్న వాటర్ బాటిల్ కూడా తెచ్చుకున్నాడు.

చెల్లెళ్ళను లేపుదామనుకుంది.

మనస్కరించలేదు.

తండ్రి తింటుండగా పక్కన కూర్చుని అతని వైపే చూస్తోంది. రెండు ముద్దలు తిన్న రాజ్ మహమ్మద్ "ఇంతకీ నువ్వు తిన్నావా?" ప్రశ్నించాడు.

శమీమ్ అవును కాదు అన్నట్లుగా తల ఊపింది.

రాజ్ మహమ్మద్ పళ్ళెంలో కలుపుకున్న అన్నం ముద్దల్ని కూతురుకు తినిపించాడు. "చాలు నాన్నా!" అందామనుకుంది. మాట పెగల్లేదు... పొలమారినట్లయింది. హృదయంలోంచి పొంగుకొచ్చిన బాధ కళ్ళ ద్వారా బైటికి వచ్చింది. మహమ్మద్ వెంటనే తల మీద చిన్నగా తట్టి మంచినీళ్ళు తాగించాడు.

"అల్లా తనకు రెండు చేతులూ ఇవ్వకపోయినా మంచి నాన్నను ఇచ్చాడు!" మనసులో అనుకుంది శమీమ్. అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు వచ్చాయి.

ఈసారి వచ్చిన కన్నీళ్ళు పొలమారడం వల్ల

వచ్చినవి కాదని పితృహృదయం గ్రహించింది. భోజనం ముగించి చేతులు కడుక్కుని భుజం మీద చెయ్యి వేసి మంచం దగ్గరకు తీసుకువెళ్ళాడు.

షమీమ్ దుఃఖం ఆపుకోలేకపోయింది.

వెక్కివెక్కి ఏడ్చింది.

"నాన్నా! చేతుల్లేకపోవడం బాధగా వుంది నాన్నా! నన్నెందుకిలా పుట్టించాడో అల్లాని నిలదీయాలని ఉంది... నేనే పాపం చేశాను.. అందరిలా ఎందుకు ఉండలేకపోతున్నాను... చేతులు చేసే పనులు కాళ్ళు చేయలేకపోతున్నాయి. ప్రతి పనికీ ఎంతో కష్టపడవలసి వస్తోంది. నేను నాకాళ్ళ మీద నిలబడాలి.. నన్ను నేను పోషించుకోవాలి. ఎవరికీ భారం కాకూడదు.." ఒక్కొక్క మాట చెబుతుంటే రాజ్ మహమ్మద్ మౌనంగా విన్నాడు.

రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు.

"అంగవైకల్యం శాపం కాదు.. దానిని నువ్వు జయించాలి. నీ జీవితం ఎంతోమందికి ఆదర్శం కావాలి... అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వారు కూడా నిన్ను చూసి సిగ్గు పడాలి. ఈ ధైర్యాన్ని నువ్వు అలవరచుకోవాలి... రైలులా ముందుకు దూసుకుపోవాలి... నిన్ను చూసి నేర్చుకోవాలి..." వివిధ విషయాలను వివరించి చెప్పాడు. ఎంతోమంది వికలాంగుల జీవితాలను మలుపుతిప్పిన సంఘటనలను వివరిస్తుంటే షమీమ్‌కు కళ్ళు మూతలు పడ్డాయి. మంచంపై ఒరిగిపోయింది. దుప్పటి కప్పి లైటు ఆర్పి పక్క గదిలోకి వచ్చాడు రాజ్ మహమ్మద్.

* * *

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపంలో సిర్సాపల్లి గ్రామానికి చెందిన రాజ్‌మహమ్మద్, ఇమామ్ బీలకు ముగ్గురు సంతానం. ముగ్గురు ఆడపిల్లల్లో మహమ్మద్ షమీమ్ పెద్దది. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఉద్యోగస్తుడైన రాజ్‌మహమ్మద్‌కు అధికారులు రైల్వేకాలనీలో క్వార్టర్ కేటాయించడంతో కుటుంబంతో సహా అక్కడే ఉంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మారుమూల ప్రాంతం వారికి ఎంతో నచ్చింది.

పెద్ద కుమార్తె మహమ్మద్ షమీమ్‌కు పుట్టుకతో రెండు చేతులు లేకపోవడం చూసి కుటుంబ సభ్యులు అందరూ ఆశ్చర్యపోయారు. ఇటువంటి పుట్టుక అరుదుగా జరుగుతుందని వైద్యులు తెలిపారు.

రెండు చేతులూ లేనప్పటికీ షమీమ్‌లో ఉత్సాహం తగ్గలేదు. చిన్నతనంలోనే చదువు పట్ల ఎంతో ఆసక్తి చూపించేది. దానికి తగినట్లే చేతులతో చేయవలసిన పనులన్నీ కాళ్ళతోనే చేసేది. రాయడం చదవడం, తినడం, తాగడం వంటి పనులు అలవోకగా చేయడం సులభంగా వచ్చింది. ఆమెకు లోపం ఆమెకు తెలియకుండా అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ తల్లిదండ్రులు ఆమెను తీర్చిదిద్దారు.

ఒంటరితనాన్ని ఎక్కువ ఇష్టపడే షమీమ్ ఆసక్తిని కనిపెట్టి ఆమె తండ్రి ప్రొఫెషనల్ కోర్సు నేర్చుకోమని సూచించాడు.

* * *

తండ్రి రాజ్‌మహమ్మద్ చెప్పిన విషయాలన్నీ షమీమ్ మనసులో బలంగా నాటుకున్నాయి. ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ ప్రాధాన్యం ఆమె మనసు గుర్తించింది. ఆ కోర్సు నేర్చుకున్నట్లయితే ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలుసుకుంది.

కంప్యూటర్ సెంటర్‌లో చేరింది.

నిర్వాహకులు ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాని షమీమ్ ఉత్సాహం, పట్టుదల చూసి తలవంచారు.

కాళ్ళతో కీబోర్డును ఆపరేట్ చేయడం నేర్చుకుంది. మొదట కష్టం అనిపించేది. రానురాను అందులో ప్రావీణ్యం లభించింది. డెస్క్‌టాప్ ప్రింటింగ్, ఇంటర్‌నెట్ ఆపరేషన్, కంప్యూటర్‌లో ఎన్ని రకాల దశలు ఉన్నాయో అన్నీ నేర్చుకుంది. కాళ్ళతో ఆమె కంప్యూటర్‌ను పరుగెత్తించడం చూసే వారిని ఆశ్చర్యానికి లోను చేసేది.

కంప్యూటర్ కోర్సుల్లో అన్ని రకాల సర్టిఫికెట్లు సంపాదించింది. రకరకాల ఉద్యోగాలకు తన అర్హతలతో దరఖాస్తులు పంపేది.

ఆమె దరఖాస్తులకు చాలాకాలం తర్వాత ఫలితం వచ్చింది. ఆమెకు రైల్వేలోనే ఉద్యోగ అవకాశం లభించింది.

* * *

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు.

షమీమ్‌కు చాలా సంతృప్తిగా ఉంది.

తన ఆనందాన్ని తల్లిదండ్రులతోనూ చెల్లెళ్ళతోనూ పంచుకుంది. అందరూ ఎంతో సంతోషించారు. ఆర్డరు రాగానే ఉద్యోగంలో చేరిపోవాలి.

ఈ రైల్వే స్టేషను... ఎప్పటికీ కలవని పట్టాలు... గుబురు గుబురు చెట్లు... ఇనుప కమ్మెల కంచెతో ఉన్న ఇల్లు వదిలిపోవడం ఆమె మనసు ఇష్టపడటం లేదు.

మేడపైన ఒంటరిగా కూర్చుంది.

ఆ రోజు కూడా వెన్నెల రాత్రే.

పున్నమి నక్షత్రాలను వెలిగిస్తోంది. వెన్నెల కిరణాలు గుబురు వృక్షాల మధ్య నుంచి చొచ్చుకుని భూమిని గుచ్చుకుంటున్నాయి.

రైలు పట్టాలపైన వెన్నెల ప్రతిఫలిస్తోంది.

ఆకాశంలో చంద్రుడిని దాటుకుంటూ మబ్బు తునకలు ముందుకు దూసుకుపోతున్నాయి.

పుచ్చపువ్వులాంటి వెన్నెల ఆకాశంలో పూర్తిగా పరుచుకుంది.

వెన్నెల వర్షం కురుస్తోంది. ★

పరిణామం

(9వ పేజీ తరువాయి)

అమ్మేద్దామనుకుంటున్నాను" అంటూ కార్మికులను ఉద్దేశించి చెప్పాడు బాపినీడు.

కార్మికులంతా ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. అంతా నిశ్శబ్దం అలముకుంది.

"ఇంతకాలం మీరు నా కన్నబిడ్డల్లా ఫ్యాక్టరీని చూసుకున్నారు. అందుకు మీకు తృణమో, ఫణమో ఇచ్చి మీ రుణం తీర్చుకుందామనుకుంటున్నాను. ఈ ఫ్యాక్టరీని అమెరికా కంపెనీవోడు తీసుకున్నాక ఆడే మిషన్లతో నడిపించుకుంటాడు. కనుక మీకూ – ఈ కంపెనీకి త్వరలో రుణం తీరిపోతుంది" అన్నాడు బాపినీడు అందరిలో కలకలం చెలరేగింది.

"అదేంటి బాపినీడు బాపూ... పల్లెనుండి ఇక్కడకు తీసుకొచ్చి... ఏదో ఇక్కడ ఇంత ధారకం చూపిత్తన్నారని.... ఫ్యాక్టరీ నీడలో చల్లని సెట్టు క్రింద షక్షుల్లా ఇంతకాలం ఇక్కడ బతుకు గడుపుకొచ్చినం ఇప్పుడు అర్ధాంతరంగా ఫ్యాక్టరీని అమ్మేస్తామంటూ... మా కడుపులు కొడితే ఎట్టాగయ్యా" అంటూ దీనంగా చంద్రయ్య.

"నానేటి సేస్తానురా... ఫ్యాక్టరీ నడవాలంటే... నాకు సత్తువ ఉండొద్దూ... నేను దినదినానికి అప్పులపాలయ్యేకంటే... ఇప్పుడే రెండు రూపాయలు వెనకేసుకోవాలంటే ధర వచ్చినప్పుడు అమ్మేసుకోవాల" అన్నాడు నిర్లక్ష్యంగా.

"మీకు నష్టం ఎందుకొచ్చినాదండీ... లాభాల్లో ముప్పావు వంతు మీరే ఇప్పటివరకూ అనుభవిత్తన్నారు. కూలీ రేట్లు పెంచకపోయినా.. పనికోసరమే మా రక్తం ధారబోసి పెంచిన కంపెనీని... ఇప్పుడు మూసేత్తావంటే మా బతుకులు ఏం కావాల" అని అడిగాడు ఎర్ర సత్యంగాడు. అతనికి కాస్తా ఆవేశం ఎక్కువ. అన్యాయాన్ని ఎదుర్కోవాలనే ఆరాటమూ ఎక్కువే.

"నేను మీకు లెక్కలు చెప్పనవసరం లేదయ్యా... నా కంపెనీ... నా ఇష్టం... మా అబ్బాయి విదేశాల్లో ఇంకో బిజినెస్ ఏదో సేసుకుంటాడట... ఈ ఫ్యాక్టరీని అమ్మేస్తున్నాను... అంతే" అంటూ మరో మాటకు తావు లేకుండా వెనుదిరిగి వెళ్ళిపోయాడు బాపినీడు... ప్రస్తుత భారత రాజకీయ ప్రతినిధి.

అతని కంటే వేగంగా.. అతని చంకన ఉన్న ప్రభుత్వం... నష్టాలు చూపే దఖలు పత్రాలు సిద్ధం చేసి, ఫ్యాక్టరీని మూయించడానికి సిద్ధపడింది.

* * *

మరోరోజు శిక్షకుడు బోను దగ్గరకు వచ్చి ఎండుగడ్డి మోపునొక దాన్ని బోను ముందు పడేసి 'దీన్ని తిను' అనగానే పులి ఆశ్చర్యపోయింది.

"ఇదేమిటి నాకు గడ్డిపెట్టావు.." నేను మాంసాహారినన్న విషయం మరిచిపోయావా" అంది.

"అతిగా మాట్లాడకు... ఇకనుండి నీవు-గడ్డే తినాలి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

పులి చాలా సేపు గడ్డి ముట్టలేదు. తరువాత పొట్టలో ఆకలి సముద్రపు అలల్లా విజృంభించగానే నెమ్మదిగా గడ్డిమోపువైపు తిరిగి ఆ ఎండుగడ్డిని తినసాగింది.

మొదట ఆ ఎండుగడ్డిని తినడం కష్టం అనిపించినా... క్రమంగా ఆ ఆహారానికి పులి తనను తాను అనుకూలంగా మార్చుకుంది.

తరువాత శిక్షకుడు – శిష్యులు అటువైపు ఇంకెప్పుడూ రాలేదు.

అనంతరం పులీ – బోను రెండు మాయమయ్యాయి.

వాటి స్థానంలో –

పులి భారతీయ పౌరుడు కాగా...

బోను 'గ్లోబల్ ఇండియా'గా మారసాగింది. ★

ఇదిగో... పట్టు చీర!

లక్ష్మి

వెయిటెండ్‌సీ అని ఇంగ్లీషులో ఒకపదముంది!

తెలుగులో వేచి చూడండని చెబుతారు - కాబోలు! ఏమి చెప్పినా - అదొక సిద్ధాంతం. బాగా ప్రాచుర్యం సంతరించుకున్న సిద్ధాంతం. ఎంతో సస్పెన్సుతో పాటు అంతో ఇంతో ఆసక్తి కలిగించే క్లాసు వన్ సిద్ధాంతం!

గుప్పెట్లో ఏముందో చెప్పకుండా - నీకోసమే తెచ్చేనని చెబితే తట్టుకోలేం. తెచ్చిందేమిటో తెలీక ఏదేదో ఊహించుకుంటాం!

ఊహించినదానికంటే విలువైనది తెస్తే వావ్ అని పొలికేక పెడతాం!

విలువ తక్కువది తెస్తే - ఇంతమాత్రం దానికి ప్రకటనలెందుకో అంటాం!

ఊహించిందే తీసుకొస్తే - చాల్లే సంబడమని తీసిపారేస్తాం!

ఏమీ లేదని గుప్పెట విప్పితే పళ్ళు రాలగొట్టాలనుకుంటాం!

వెయిటెండ్ సీ గొడవల్లో - ఈ నాలుగు రకాల ఫలితాలకు అవకాశముంటుంది. ఏ రకమైన ఫలితం దక్కుతుందో ఊహించలేక - గుప్పెట విప్పే వరకు ఉక్కిరి బిక్కిరవుతుంటాం! అదట్లా వుంచండి!

అడగ్గానే దొరికే వస్తువుకి విలువ వుండదు!

ఓసింతే గదా అనే చులకన భావం ఏర్పడుతుంది!

ఆ వస్తువు అంత సులువుగా దొరకదని తెలిసినప్పుడు... సప్తసముద్రాలు దాటి కారడవుల్లో కాలినడకన ప్రయాణంచేసి..... ఫలానా దీవికి చేరుకుంటే... ఫలానా చెట్టు మీద అమావాస్యనాడు మాత్రమే కనిపిస్తుందని చెప్పినప్పుడు - అది ఆఫ్టరాల్ చింతపండైనా - దాన్ని సొంతం చేసుకోడానికి తొందరపడతాం. సొంతమయ్యే వరకు బోలెడు కలలుకంటాం!

ఇల్లాంటి సందర్భాల్లో వెయిటెండ్ సీ థియరీని అన్వయించుకోవచ్చు!

అనుకోకుండా అర్జంటు పని పడింది! సెలవు కావాలి. అడగ్గానే సెలవు దొరికితే - సెలవు యొక్క విలువ తెలిసిరాదు!

విరివిగా సెలవలు ఇస్తున్నారు గనక ప్రతి అడ్డమైన పనికీ సెలవు కాగితం గీకి పారేస్తారు!

కాగితమ్మీద రాయడానికి బద్ధకమైతే ఫోన్లో చెప్పి సెలవు తీసుకుంటారు!

ఏతావాతా -

సెలవనే పదార్థమ్మీద విలువ తగ్గిపోతుంది. గౌరవం తరిగిపోతుంది. ఓసింతే గదా అనే చులకన భావం కూడా కలుగుతుంది!

సెలవివ్వడానికి సవాలక్ష షరతులు పెట్టినప్పుడూ -

చూద్దాం చూద్దామని తిప్పుతున్నప్పుడూ -

అప్పుడు -

అప్పుడే సెలవుమీద భయం భక్తీ పెరుగుతాయి!

అడిగిన సెలవు మంజూరవుతుందో లేదోనని ఆందోళన పెరుగుతుంది. ఆ స్థితిలో సెలవు దొరికితే - అదొక వరంగా భావించి తరిస్తారు! లోకకళ్యాణం జరిగిపోయినట్టు ఫీలవుతారు!

గద్దెనెక్కిన ప్రభువులు-

వెయిటెండ్ సీ థియరీ గట్టిగా నమ్ముతుంటారు!

అది చేస్తాం ఇది చేస్తామని చెబుతూ - క్రియల్లో మాత్రం జాప్యం చేస్తూ వుంటారు ! చెప్పింది వెంటనే చేసి పారేస్తే - చేసిందాన్ని ప్రజలు 'కలకాలం' గుర్తు పెట్టుకునే ఛాన్సు చాలా తక్కువ!

అంచేత -

ఒక ఆశంటూ పెట్టి ప్రజల్ని ఎప్పటికప్పుడు ఊరిస్తుంటేనే తప్ప - ప్రభువులకు మనుగడ వుండదని ధర్మసూత్రం చెబుతోంది!

చేసేది ఎంత చిన్నపనైనా అదొక మహత్తరమైన కార్యక్రమం మాదిరి ప్రచారం చేయాలి!

చేస్తేగిస్తే తామే చేయగలరు కానీ ఇతరుల చేతకాదని నమ్మించాలి. ఈ నమ్మకాన్ని బాగా బలపరచేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాలి!

ఆపైన చేయదలుచుకున్న పనికి కొన్ని వాయిదాలు వేస్తూ - చివరికెప్పుడో శుభం కార్డు వేయాలి!

ఆ దెబ్బతో-

ఆ కార్యక్రమం పట్లా... ఆ ప్రభువులు పట్లా జనంలో గౌరవ భావం పెరుగుతుంది!

సదరు ప్రభువుల ఫక్కీలోనే - ఇంట్లో మగ మారాజులు కూడా వెయిటెండ్ సీ పద్ధతిలోనే సంసార రథం నడిచేలా జాగ్రత్త పడతారు!

ఇల్లాలు పెట్టుకున్న పట్టుచీర ఇండెంటుని ఆర్నెల్ల పాటు - అదిగో ఇదిగో అని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వుంటారు!

ఆవిడ ఆ విషయం మరిచిపోతే - అప్పుడెప్పుడో పట్టుచీర అడిగేవు కదా... ఆ పని మీదే వున్నానని గుర్తు చేస్తూ వుంటారు!

ఒక శుభముహూర్తంలో పట్టుచీర పట్టుకొచ్చి కట్టుకోమంటారు!

ఒక పట్టుచీర తన చేతికి రావడానికి వెయిటెండ్ సీ పద్ధతిలో ఆర్నెల్లు పట్టిన కారణంగా - ఆమెకు పట్టు చీరతో పాటు పతిదేవుడు కూడా పది కాలాల పాటు గుర్తిండిపోవడం సహజమే కదా!

ఈ సందర్భంగా-

ప్రేమ పురాణాలు కూడా వెయిటెండ్ సీ పద్ధతిలో జరిగేలా జాగ్రత్త పడవలసిందిగా పెళ్ళికాని ఆడపిల్లల్ని హెచ్చరిస్తున్నాను!

డార్లింగ్ నా కౌగిట్లోకి రమ్మని ప్రియుడు ఆహ్వానించగానే - ఆమె అతని గుండెల్లో గువ్వలా ఒదిగిపోతే నష్టపోయేది ఆడపిల్లే!

అంచేత -

ఈ కౌగిలి కార్యక్రమానికి ఎప్పటికప్పుడు బ్రేకులు వేయాలి. ప్రియుడికి ఎంతదూరంగా వుంటే - కౌగిలికి అంత విలువ పెరుగుతుంది!

పెళ్ళయ్యాక గాని ఈ కొంటె కోరిక తీరదని అతనికి జ్ఞానోదయమవుతుంది. ఆ పైన తప్పనిసరిగా ఆమెతో పెళ్ళవుతుంది!

అడగ్గానే -

అడిగిందల్లా ఇచ్చేసుకుంటో పోతే....

ఆడపిల్లలు -

అప్పరాలవుతారు ! అశాంతి పాలవుతారు ! జాగ్రత్త! ★

ఓటు 'విలువ' తెలుసుకోండి

రుక్మిణి

"ఓటు విలువ" తెలుసుకోండంటే ఏందో నా కర్థం కాలేదు. ఓర్నీ యాద్గిరన్నా. హోటల్లో ఇడ్లీ.. కాఫీ–టీల ధరల బోర్డు పెడతరు. సబ్బుల మీద పాకెట్ల మీద దాని రేట్లు రాస్తారు. మరి ఈ 'ఓటు విలువ' దానికింత రేటని పబ్లీకున టీవీల్లో తెగేసి చెప్పడం ఎలక్షను కోడు కోతకిందికి రాదో!" జక్కులోడు నిర్వేదంగా అని బుర్రకాయ గీక్కున్నాడు.

"ఆ 'రేటు' కాదెన్! అందర్ని ఫోన్ల ద్వారా పలకరించి ప్రచారం చేయడానికో ప్రోగ్రాముంది – చూద్దాం... టయం అయింది గదా!" యాద్గిరి సాలోచనగా అనగానే టీవీలో కార్యక్రమం మొదలైంది. ఉదయమే పైరగాలింకా కుదుతూంది మల్లేశు.. గురివిగాడు కూడా కూలబడి టీవీకి కళ్ళప్పగించారు. టీవీలో బాబుగారు ఆం.ప్ర.లోని మొత్తం నియోజకవర్గాలలో రోజూ ఏదో ఒక గ్రామంలోని ఫోన్ నెంబరు లంకించుకుని వారితో ఫోన్‌లో ముఖ్యమంత్రి మాట్లాడేస్తున్నాడు. దాన్లో ప్రత్యేకించి 'ఓటు వినియోగం – హక్కు – అవసరం' గురించి పూదర ప్రశ్నలేస్తున్నారు – అయితే దాన్లోనే వారు విశేషంగా నొక్కి చెప్పి అడిగే ప్రశ్న 'ఓటువిలువ'. ఈ విషయంల 'విలువ' విషయం అర్థం గాక చాలా మంది పండిత పామరులు బుర్రకాయలు బద్దలు కొట్టుకుంటున్నారు. 'విలువ' అంటే ఏమిటి? దానిని సాపేక్షంగా 'విలువ'ను ఏ విలువలలో లెక్కలు గట్టవలె? అని తెగ మథన పడిపోతున్నారు. సరే... అది సాగుతుంటే జక్కులోడు మైమరచి నోరుబార్లా తెరిచి ఆలకిస్తున్నాడు.

మల్లేశానికి మాత్రం ఈ 'విలువ'లో బాబుగారు 'భవిష్యత్తు' అనే మాట కూడా 'మన' అని జోడించి వాడుతుండడంతో పండ్లు పటపటనూరుతూ కూర్చున్నాడు.

"హలో... కంబాలపల్లి... లక్ష్మిగారూ.. మీరు తప్పకుండా 'మన' ఓటు 'విలువ'ను గుర్తెరిగి వినియోగించుకోవాలి. 'మన' భవిష్యత్తుకోసం అవసరం–" బాబుగారి ఉవాచ.

"గదే... గదే... మొన్న 'మన' పార్టీ వారడొచ్చి 'మన' పార్టీకి ఓటు వేస్తనే. ఇండ్లప్లాటూ... రేషనుకారటూ ఇస్తమన్నారు. "మన పార్టీకి వేయకపోతే ఇయ్యరే" అని అడిగిన– "అవతల నుండి లక్ష్మిగారి ఆక్రోశం.. మధ్యలోనే బాబుగారు లంకించుకున్నారు – "మన భవిష్యత్తంతా మన చేతిలోనే వుంది – మన ఓటు విలువ...

"ఇండ్ల ప్లాటూ.. రేషను కారటూ... గంతేగద సారూ.. ముందుగవి మా మొకాన కొడితే... వెంటనే బాబుగారు లైన్ కట్ చేసేశారు.

"ఓటు విలువా... నిలువా!" జక్కులోడు మటమటలాడాడు.

"హలో... ఈశ్వర్రావుగారా... గుంటూరు... పవిత్రమైన ఓటు... విలువైంది.. మన ఓటు ఉపయోగించుకోవాలి... మనోళ్ళందరికీ విషయం చెప్పండి.."!

"చిత్తం... నేనేనండి... మన సిట్టింగుగారు ఈసారి మీరు టికెటివ్వలేదని బాగా రైజింగైపోయి నాడండీ.. మనోడేగదండీ.... ఇండిపెండెంటుగా తిగబడి ఎగబడిపోతున్నాడు. ఎంతైనా ఆయనగారే అయిదారొందలు పెచ్చుగా ఇస్తానంటున్నాడండీ... డబ్బెవరికి చేదండీ..." బాబుగారు వెంటనే ఫోను కట్ చేసేశాడు.

"ఓటు విలువా... ఓటు విలువా.. జక్కులోడు జబ్బలు చరిచాడు" యాద్గిరి వాడ్ని నాలుగు బూతులు తిట్టి నోరుమూయించాడు.

"ఎవరమ్మా... ఓహో... భారతిగారూ.. అంతా బాగేదా... సర్సరె... 'మన ఓటు విలువ' 'మన భవిష్యత్తు' ఈ విషయంలో మీరు చాలా జాగ్రత్తగా వుండాలె! గత కాలపు దుష్టపాలకులు ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. మీ ఓటు 'విలువ' మీరు తెలుసుకోండి–" బాబుగారు పూదర పెడుతూనే వున్నారు.

"ఎంత?" చాలా కర్కశంగా ప్రశ్న వినబడింది.

"ఎంతేంటి?" బాబుగారు అయోమయంగా అడిగారు.

"ఎంత?" మళ్లీ కంచుమోగినట్లు మోగింది.

"మీ భవిష్యత్తు మీ చేతిలోనే వుంది. అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు... ఎన్నెన్నో..

"మా భవిష్యత్తు మీ విద్యుత్ దెబ్బకే పటాపంచలయ్యింది. నా మొగుడు పని చేసే కంపెనీని ప్రైవేటువాడికమ్మి పారేస్తె – వీధుల్లో పడి తిరుగుతున్నాం – ఇంకా మాకు భవిష్యత్తేంది?" ఆవిడ వెనకా ముందూ చూడకుండా ఫోను కట్ చేసి పారేసింది.

జక్కులోడు లపలప చప్పట్లు చరిచాడు. యాద్గిరి రెండు బూతులు తిట్టాడు.

"ఓహో... హలో... నర్సిమ్మా.. ఏం చేస్తున్నావ్.. రేపు ఓటు తప్పకుండా వెయ్యాలి. ఓటు చాలా విలువైంది.... దాని విలువ తెలిస్తేనే 'మన' భవిష్యత్తు..

"ఎవరికి వేయాలి!" నర్సిమ్మ మహా మొరటుగా అడిగాడు.

"నీ ఓటు 'విలువ' ముందు నువ్వు తెలుసుకో..."

"గదే... నా ఓటు విలువను ఎవడు లెక్కగట్టేది సార్... మా నియోజకవర్గంలో మూడు పార్టీలు.. ఆరుగురు రెబల్సు వున్నారు. నేను నా ఓటు 'విలువ'ను ఎవరి దగ్గర తేల్చుకోమంటారు" నర్సిమ్మ మహా గడుసుగా అడిగాడు.

"నీ భవిష్యత్తు.. అది ముఖ్యం... అది బాగు వడాలంటే ఆలోచించుకో...

"సార్. దాని ముచ్చట తర్వాత... గత పదేండ్ల నుండీ నాకేదారీ కనిపించడం లేదు. వున్న రెండెకరాలు బోరుబావి.. కరంటు బిల్లు దెబ్బకు అమ్ముకుంటిని – పనిలేదు – నా కొడుకు చదువు మానేసి కూల్నాలి చేస్తనంటడు. నాకే దొరకటం లేదు. ఇంకా భవిష్యత్తు కలలు... ఎక్కడివి...

"నీ ఓటు విలువ ముఖ్యం!" బాబుగారు మటమటలాడి కట్ చేశాడు.

"అన్నా మన భవిష్యత్తంతా గిటీవిల్లోనే వెలిగిపోతా వుండి – పిచ్చ.. కొడుకు – టీవీ ముందు కూలబడితే పాయె!" జక్కులోడు లపలప వాగాడు.

"హలో... రామకృష్ణ... ఎం.సి.ఏ... గుడ్.. మొదటిసారిగా ఓటు అంటున్నావు – చదువుకున్న వాడివి – నీ ఓటు విలువ నీకు బాగా తెలుసు 'భవిష్యత్తు' అది ముఖ్యం.

'థాంక్స్ సార్. గత మూడేండ్ల నుండీ యంసిఏ పుచ్చుకుని మీలాగే కంప్యూటరోటి ముందేసుకుని ఇంటర్నెట్ తగిలించి 'సమాచార విప్లవమని' రోజుకు పద్దెనిమిది గంటలు పని చేస్తున్నా....

"ముందు నీ ఓటు విలువ... అదీ పాయింటు..."

'పాయింటే – సమాచారంతో నీ బుర్ర నిండిపోయింది. పాపం కడుపే ఆకలని అల్లరిని చేస్తుంది – నా విలువైన ఓటు... దాన్ని తనకా పెట్టడానికి ఏ బ్యాంకైనా ఒప్పుకుంటుందా... మీకూ ప్రపంచబ్యాంకుకూ ఇంటర్నల్ లింకు గదా... వాళ్ళ వడ్డీతోనే – నా ఓటును వారికి తనకాకు తగిలిద్దామనీ....!" లైను కట్టయింది – జక్కులోడు నేలమీదపడి దొర్లుతూ నవ్వు!

"ఒరే తమ్మా... ఈసారి నీ ఓటు ఎవరికి వేద్దామనుకుంటున్నావు–" యాద్గిరి అడగంగానే జక్కులోడు నోరెళ్ళబెట్టాడు. "పోనీ... నిలబడ్డవాళ్ళలో ఎవరైతే బాగనుకుంటున్నావు" ఈసారి జక్కులోడి బుర్ర పన్జేసింది. "అన్నా... మనిషి కాస్తంత మంచాడై మనకు ఒరగబెట్టేదేం లేదు – వాడు మంచోడే – మరి వాళ్ళ పార్టీ? మంత్రివర్గం... ఈయనగార్దేముంది?"

యాద్గిరి మెచ్చుకున్నాడు "తమ్మ ప్రతిపార్టీ గత చరిత్రా – విధానాలు... అమలు చేసిన తీరూ.. ఇది చూడాలిగానీ – మనిషి బులిబులి మాటలు... అట్టహాసం... ఇవికావు..!"

యాద్గిరి మాటల్లోనే తాగుబోతు జాకోబు లల్లాయి పదాలు పాడుకుంటు చేరాడు. "ఏందన్నా... ఓట్ల పండగ... ఖుషీ... మూడు పార్టీ... ఆరు రెబల్సు.. పండగే పండగ...దినం ఒకని దగ్గరకు పోతే మందుకు సరిపాయె–" వాడు చెంచాటకు తగులుకున్నాడు – "మరి నీ ఓటు ఎవరికి వేస్తావురా?" వాడ్ని యాద్గిరి గద్దించి అడిగాడు.

"ఎవనికా? ఆ దినం వరకు లెక్కలు గట్టి... ముందు ఛార్జీల లెక్కలేసి. ఇచ్చే డబ్బులు కలిపేసి చాలనీతిగా ఎవడెక్కువ నాకు 'జమ' చేసిండో వాడికే నా ఓటు"! వాడు ఏకవికా నవ్వాడు – జక్కులోడు చీదరించుకున్నాడు! ★



డా॥ నాగినేని భాస్కరరావు

వైరల్ హెపటైటిస్ - కామెర్లు

(గత వారం తరువాయి)

కామెర్ల జబ్బు వైరస్ క్రిముల వల్ల వస్తుంది. రకరకాల వైరస్ క్రిములు కామెర్లను కలుగజేస్తాయి. అవి :
ఎ) హెపటైటిస్-ఎ, బి) హెపటైటిస్-ఇ, సి) హెపటైటిస్-బి, డి) హెపటైటిస్-సి, ఇ) హెపటైటిస్-డి ఎఫ్) హెపటైటిస్-జి వైరల్ హెపటైటిస్‌లో ముందుగా చెప్పినట్లుగా వైరస్ సోకిన కాలేయం వాచిపోతుంది. హెపటైటిస్-ఎ, ఇ వైరస్‌లు మల-నోటి మార్గాన శరీరంలోకి ప్రవేశిస్తాయి. కామెర్లు కలిగిస్తాయి. అంటే కలుషిత నీరు లేక ఆహార పదార్థాలు తినడం వల్ల వ్యాధి ఒకరి నుండి మరొకరికి సోకుతుంది. పై రకాల కామెర్ల జబ్బులో లక్షణాలు ఈ కింది విధంగా వున్నాయి.

హెపటైటిస్-ఎ వల్ల వచ్చే కామెర్లు : ఈ వైరస్ చిన్న ఆర్.ఎన్.ఎ. వైరస్. ఇది ప్రేవుల ద్వారా గాని, మల-నోటి ద్వారాగాని వ్యాప్తి చెందుతాయి. కలుషిత ఆహారం, నీరు తీసుకొనుట వల్ల జబ్బు వస్తుంది. వ్యాధి సోకిన సముద్రపు ఆహారం ఉదా. షెల్ చేప, మొలుస్కాలను తినటం వలన కామెర్లు వస్తాయి. రక్తంలో వ్యాప్తి మనిషి నుండి మనిషికి జరుగుతుంది. ఇంక్యుబేషన్ కాలం 15-50 రోజులు (సగటున 28 రోజులు). లక్షణాలు అగుపించుటకు కొద్ది రోజులు లేక రెండు వారాలకు ముందు వరకు రోగి మలంలో వైరస్ క్రిములను విసర్జిస్తాడు. కామెర్లు అగుపించక అది తగ్గిపోయి తక్కువ స్థాయిలో కొన్ని నెలల వరకు వైరస్ క్రిములను మలంలో విసర్జిస్తాడు.

హెపటైటిస్-ఇ వైరస్ : ఇది కూడా ఆర్.ఎన్.ఎ వైరస్. 32-34 ఎన్.ఎమ్. సైజులో వుంటుంది.

లక్షణాలు : హెపటైటిస్-ఎ, ఇ కామెర్ల లక్షణాలు. ఏ లక్షణం లేని దశ నుండి ప్రమాదకరమైన కాలేయం ఫెయిల్యూర్ వరకు వుంటాయి.

సాధారణంగా కామెర్లు హఠాత్తుగా ప్రారంభం అవుతుంది. జ్వరం, నీరసం, త్వరగా అలసిపోవటం, కడుపులో బాధగా వుండటం, ఆకలి లేకపోవడం, వాంతులు కదలటం మొదలగు లక్షణాలుంటాయి. కొంతమందికి ఆహారం అన్నా పొగతాగటం అన్నా విముఖత వుంటుంది. అంతలోనే మూత్రం బాగా ముదురు రంగులో పోయటం జరుగుతుంది, కామెర్లు కన్పించుతుంది. కొంతమంది రోగులు తెల్లని మలాన్ని విసర్జిస్తారు. శరీరంలో దురద వస్తుంది. జ్వరం మధ్యస్థాయిలో వుంటుంది. చలి వుండదు. కామెర్లు కనిపించాక జ్వరం తగ్గిపోతుంది. కామెర్లు కొద్ది వారాలుంటుంది.

పరీక్ష చేస్తే కళ్ళు పచ్చగా కన్పించటం, కాలేయం వాచిపోవటం, నొప్పిగా వుండటం జరుగుతుంది. ప్లీహం పెద్దదై కొద్దిగా తాకగల స్థితి వస్తుంది. అస్వస్థత 8 వారాల వరకు ఉంటుంది. 10-15 శాతం రోగుల్లో 6 నెలల వరకు ఉంటుంది. వీరిలో కొద్దిమంది తీవ్ర జబ్బుకు గురై చావుకు దగ్గరయ్యే కాలేయం, ఫెయిల్యూర్, చికాకుగా వుండటం, నిద్రలేకపోవడం, ప్రవర్తనలో మార్పు, చివరకు కోమా (అపస్మారక స్థితి)లోకి వెళ్తారు. మెదడులో నీరు చేరుతుంది. వీరిలో 90 శాతం ఎంత వైద్యం చేసినా చనిపోతారు.

తరుణ హెచ్.ఐ.వి. వ్యాధి





హెపటైటిస్-బి వైరస్ ప్రకృతి చరిత్ర

కొద్దిమంది రోగుల్లో దురద ఎక్కువగా వుంటుంది. హెపటైటిస్-ఎ వైరస్ కామెర్ల లక్షణాలు వయస్సుకు సంబంధించి వుంటాయి. పిల్లల్లో (70 శాతం 6 సంవత్సరాలలోపు) అసలు లక్షణాలుండవు. ఒకవేళ లక్షణాలుంటే అందులో కళ్ళు పచ్చబడటం వుండదు. కేవలం 'ఫ్లూ' లక్షణాలుండి తగ్గిపోతుంది. కాని పెద్దల్లో లక్షణాలు తీవ్రంగా వుంటాయి. హెపటైటిస్-ఇ వైరస్ కామెర్లలో కూడా ఇదే విధమైన సంబంధం వుంటుంది. గర్భిణీ స్త్రీలకు ఇది సోకితే ఎక్కువ తీవ్రంగా వుండదు.

హెపటైటిస్-ఎ, ఇ వైరస్‌ల వల్ల కలుగు కామెర్ల జబ్బు దానంతట అది తగ్గిపోతుంది. స్వయం-హద్దులలో ఏ విధమైన తదుపరి పరిణామాలుండవు. దీర్ఘకాలిక స్థాయికి పోవు.

వ్యాధి నిర్ధారణ : హెపటైటిస్-ఎ వైరస్ వల్ల కలుగు కామెర్లను పరీక్షలో సీరమ్‌లో హెపటైటిస్-ఎకు వ్యతిరేకమైన యాంటీబాడీలను కనుక్కొనుట ద్వారా నిర్ధారించవచ్చు. జబ్బులో వున్నప్పుడు 1 గ్రామ్ బాడీలు ముందు కన్పిస్తాయి. ఇవి జబ్బున్నంత కాలం వుంటాయి. ఈ యాంటీబాడీలు కొన్ని నెలల వరకు శరీరంలో వుంటాయి. జీవితాంతం కూడా. దీనికి మరే జంతువు రిజర్వాయరుగా లేదు.

చికిత్స : హెపటైటిస్-ఎ, ఇ వైరస్‌ల వల్ల కలుగు కామెర్ల జబ్బుకు ప్రత్యేక వైద్యం ఏమీ లేదు. నిజానికి వీటివల్ల జబ్బుపడ్డ వారిలో చాలా మందికి చికిత్స అవసరం లేదు. ఎందుకంటే జబ్బు స్వయం హద్దులు కలిగినది. అయితే ఈ కింది ఆహార నియమాలు పాటిస్తే మంచిది.

1) ఎక్కువగా చక్కెర తినుట (గ్లూకోజు), పిండి పదార్థాలను తినుట.
2) మాంసాహారం, కొవ్వు పదార్థాలను కొద్ది వారాల పాటు తినకుండా వుండుట.

జబ్బు తీవ్రంగా వుంటే తప్ప రోగి దైనందిన కార్యక్రమాలకు ఆటంకం కల్పించరాదు. అయితే జబ్బు తీవ్రంగా వుంటే అతన్ని జాగ్రత్తగా గమనంలో వుంచుకోవాలి. తీవ్రమైన కాలేయం ఫెయిల్యూర్‌కు జాగ్రత్తగా చికిత్స చేయాలి. వీరికి లాక్టులోజ్ నోటి ద్వారా ఇవ్వాలి. మెదడులో ఒత్తిడిని తగ్గించాలి. వీరికి కార్టికోస్టీరాయిడ్స్‌ను ఇవ్వరాదు. దురద బాగా వున్న వారికి యాంటీ హిస్టామైన్ మందులు ఉదా : కొలెస్ట్రామైన్ ఇవ్వవచ్చు.

నివారణ, నిర్మూలన : ఒక్కసారి హెపటైటిస్-ఎ వైరస్ వల్ల కామెర్లు వచ్చినట్లయితే అది దాదాపు జీవితాంతం నిరోధకశక్తిగా పని చేస్తుంది. శుభ్రమైన, సురక్షితమైన నీటి సరఫరా ద్వారా, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను తయారు చేయుట, పరిశుభ్రమైన ఆహారం తీసుకునే అలవాట్లను పాటించుట ద్వారా హెపటైటిస్-ఎ వైరస్ కామెర్ల జబ్బును వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది సాధ్యమైంది. ఒకే కుటుంబంలో వ్యాధి వ్యాప్తి కాకుండా - మలము ద్వారా - మల విసర్జన - దానిని బయటకు పంపటం మొదలగు శుభ్రమైన పద్ధతుల్లో జరగాలి.

టీకాలు : ముందు జాగ్రత్తగా హెపటైటిస్-ఎ వైరస్ కామెర్లకు టీకాలు ఇవ్వచ్చు. జబ్బు రావటానికి ముందు, వచ్చిన తరువాత ఇమ్యూన్ సీరం గ్లోబులిన్ 1 ఎస్‌జి 0.02 ఎమ్ఎల్/25 కిలో బరువు కండరానికి ఇంజక్షన్ చేయుట ద్వారా టీకా ఇవ్వవచ్చు. ఇది 2-3 నెలల వరకు ప్రభావం చూపుతుంది. ప్రయాణీకులకు, ఇంట్లో వున్న కుటుంబ సభ్యులకు ఇవ్వవచ్చు. హావ్రిక్స్ - ఇది హెపటైటిస్-ఎ వైరస్ యొక్క నిర్వీర్యం చేయబడిన ప్రొటీను. **మోతాదు :** రెండు డోసులు (డెల్టాయిడ్ కండరానికి) ఇవ్వాలి. 2-4 వారాల వ్యవధిలో రోగికి 6 సంవత్సరాల వయస్సు మించినట్లయితే ఇది 1 సంవత్సరం పని చేస్తుంది. 3వ మోతాదు 6 నెలల తరువాత ఇచ్చినట్లయితే 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.

నేడు మార్కెట్‌లో అనేక కంపెనీలు పెద్దలకు, పిల్లలకు మోతాదుల్లో టీకాలు సరఫరా చేస్తున్నాయి. హెపటైటిస్-ఇ వైరస్ వలన కలుగు కామెర్ల జబ్బులకు - టీకా లేదు.

హెపటైటిస్-బి వైరస్ వల్ల కలుగు కామెర్లు : (హెచ్‌బివి) :

హెపటైటిస్-బి వైరస్ తీరును అర్థం చేసుకొనుటకు చేసిన ప్రయత్నాల్లో 1965లో బ్లూమెర్గ్

అనునతడు ఒక ఆస్ట్రేలియా ఆదిమ వాసి రక్తంలో 'ఆస్ట్రేలియా యాంటిజెన్'ను కనుగొనుట వలన దాని తీరు అర్థమైంది. ఆ తరువాత హెపటైటిస్-బి సర్ఫేస్ యాంటిజెన్ హెచ్‌ఎస్‌ఏజిగా గుర్తింపబడింది.

వ్యాప్తిచెందు విధానం : హెచ్‌బిఎస్ ఎజి రక్తంలో, వీర్యంలో, స్త్రీ జననేంద్రియాలలో, లాలాజలంలో, తల్లిపాలలో, పిత్తరసం, పిండద్రవం, ఉదర పొరల్లో చేరిన నీటిలో వున్నది. దీనికి వ్యాప్తికి అనేక విధానాలున్నాయి.

1) ఇంజక్షను లేక చర్మం ద్వారా : రక్తం, ప్లాస్మా ఫాక్టరు-8, 10, ఫైబ్రినోజన్ - కలుషితమైన సూదులతో ఇంజక్షను, రక్తమార్పిడి, కలుషితమైన పరికరాలతో ఆపరేషన్లు, పండ్లు పీకటం, పచ్చబొట్లు పొడవడం, చెవులు కుట్టడం, ఆక్యుపంక్చరు వైద్యం చేయటం, మత్తు పదార్థాలకు బానిసైన వారు సూదుల్ని మార్చుకోవటం, కలుషితమైన రేజర్లు, గోళ్ళు తీసుకునే పరికరం, టూత్‌బ్రష్‌లు మొదలైనవన్నీ హెపటైటిస్-బి వైరస్‌ను వ్యాప్తి చేస్తాయి.

2) వెర్టికల్ లేదా పరినాటల్ : దీర్ఘకాలిక జబ్బుతో వున్న తల్లి నుండి లేక గర్భిణి చివరి మూడు మాసాల్లో తమణ కాలేయ వాపుకు గురైన తల్లి నుండి బిడ్డకు పుట్టేటపుడు (ఎమ్నియాటిక్ ఫ్లూయిడ్ లేక రక్తాన్ని మింగటం ద్వారా) హెపటైటిస్-బి వైరస్ కామెర్లు సోకుతుంది. తల్లిద్వారా వ్యాధి సోకిన ఈ శిశువుల్లో 90% దీర్ఘకాలిక వైరస్ వాహకులుగా వుంటారు. ఎందుకంటే వాళ్ళలో పరిపక్వత చెందని వ్యాధి నిరోధక శక్తి వైరస్‌ను బయటకు తరిమి వేయలేదు.

3) లైంగిక సంపర్కం ద్వారా : మగవాళ్ళలో హెమోసెక్సు వల్ల, అలాగే స్త్రీ పురుషుల లైంగిక సంపర్కం వల్ల హెచ్‌బివి వ్యాపిస్తుంది.

4) నోటి నుండి నోటికి వ్యాప్తి : హెచ్‌బిఎస్ ఎజి లాలాజలంలో వుంటుంది. కనుక గాఢంగా ముద్దుపెట్టుకోవడం వల్ల హెచ్‌బివి వ్యాప్తి చెందుతుంది. అనుకోకుండా పరీక్షలు చేయునప్పుడు రక్తాన్ని పిపెట్టు ద్వారా తీసుకునేటప్పుడు హెచ్‌బిఎస్ ఎజి పాజిటివ రక్తాన్ని మింగటం ద్వారా హెచ్‌బివి వ్యాపిస్తుంది. 5) హీమోడయాలిస్ చేసినపుడు, జైళ్ళలో హెచ్‌బివి వ్యాపిస్తుంది.

లక్షణాలు : హెపటైటిస్-బి వైరస్ సోకిన వారికి జబ్బు ప్రకృతి చరిత్ర ఈ కింది విధంగా వుంటుంది. చూడండి పటం నెం.6 1) తరుణ కాలేయపు వాపు 2) దీర్ఘకాలేయపు వాపు -సిరోహాసిస్ ఆఫ్ లివర్ 3) కాలేయ కాన్సరు



1) తరుణ కాలేయపు వాపు : ఇంక్యుబేషన్ కాలం ఆరు వారాల నుండి ఆరు నెలల వరకు వుంటుంది. అకస్మాత్తుగా వస్తుంది. ఆకలి లేకపోవడం, వాంతి వచ్చినట్లు వుండటం, వాంతి కావడం, కొద్ది రోజుల పాటు జ్వరం వంటి లక్షణాలుంటాయి. కొద్దిమంది రోగులు కీళ్ళ నొప్పులతోను, కొంతమంది రోగులు దురదతోను వుంటారు.

వ్యాధి నిర్ధారణ : 1) పెరిగిన ఎఎల్‌టి/ఎఎస్‌టి విలువలు, ప్రత్యేకమైన పరీక్షల్లో వైరస్‌ల సిరోలాజికల్ మార్కర్ల వల్ల వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. 2) హెచ్‌బిఎస్ ఎజి కోసం పరీక్ష. రక్తమార్పిడికి సంబంధించిన కాలేయపు వాపు, రక్తదానం చేసే వాళ్ళలో ఇది ఎక్కువగా వచ్చే అవకాశం వుంది. **దీర్ఘకాలిక వాహకులు :** 90% పెద్దల్లో హెచ్‌బిఎస్ ఎజి వాళ్ళ రక్తంలో 3-6 నెలల్లో కనుమరుగవుతుంది. 10% మంది దీర్ఘకాలిక వాహకులుగా వుంటారు. 3) దీర్ఘకాలిక కాలేయం వాపు : ఈ దశలో కామెర్లు తీవ్రంగా వుండి ఉదరంలో నీరు చేరుతుంది. 4) చివరిదశ - కాలేయం కాన్సరు.

చికిత్స - నివారణ : ప్రత్యేకమైన చికిత్స లేదు. లక్షణాన్ని బట్టి చికిత్స. ఇతర జబ్బుకు చికిత్స స్థానికంగా హెచ్.బి.వి. వ్యాప్తి కాకుండా చర్యలు. వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం. సారాయిని మానాలి. **ఇబ్బందులు :** చావుకు దగ్గరయ్యే కాలేయపు ఫెయిల్యూర్, మూత్రపిండాలు చెడిపోవటం మొదలైనవి.

వ్యాధి నిరోధక టీకాలు : పిల్లలకు, పెద్దలకు అందరికీ ఈ టీకాలు ఇవ్వాలి. అందుబాటులో వున్నాయి. చివరగా హెపటైటిస్-సి, డి, జి. వైరస్‌ల గురించి ఈ వ్యాసంలో చర్చించలేదు.

మనం తేలికగా తీసుకునే కామెర్ల జబ్బు వెనుక ఎంతో కథను తెలుసుకున్నాం గదా. ఈ కామెర్ల జబ్బు నివారణకు రక్షిత తాగునీరు మంచి పరిష్కారం. దీనికై పాలకులపై ప్రజలు పోరాటం సాగించి సాధించుకోవాలి. స్టెరిలైజ్ పరికరాలు, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ కూడా అవసరం. సారాయిని తాగకూడదు. పొగకూడా తాగరాదు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. చివరగా కామెర్లు, ఆల్కహాలు, ఇతర కారణాల వల్ల కాలేయం జబ్బుపడితే అనేక అవయవాలు కూడా దెబ్బతింటాయి. వాటిని గురించి పటం 7లో చూడవచ్చు. కామెర్లు, నోటి దుర్వాసన, పారోటిడ్ గ్రంధి వాచుట, చంకల్లో వెంట్రుకలు పోవుట, వృషణాలు కృశించిపోవుట, పాదాలకు నీరు చేరుట మొదలైనవి.

కనుక కామెర్లు రాకుండా కాలేయాన్ని పదికాలాల పాటు రక్షించుకోవాలి. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

రక్తమార్పిడి సమయంలో హెచ్.ఐ.వి., హెచ్.బి.ఎస్. ఎజి పరీక్షలు చేయాలి. ★

కామెర్ల జబ్బులో చేయవలసినవి :

1. కామెర్ల జబ్బులు అనుమానం వచ్చిన వెంటనే అర్హత గల డాక్టర్‌ను సంప్రదించాలి.
2. తాగునీటిని బాగా మరగబెట్టి చల్లార్చి తాగాలి.
3. కలుషిత నీరు, వాతావరణం తొలగించుకునే ప్రయత్నం చేయాలి. పాలకులపై ఒత్తిడి తేవాలి.
4. ఇంజక్షన్లు తీసుకునేందుకు డిస్పోజబుల్ సిరంజీలనే వాడాలి. ఆపరేషన్లు చేయించుకునే ముందు పండ్లు పీకించుకునే ముందు, క్షురకుడితో గడ్డం చేయించుకునే ముందు ఆ పరికరాలను బాగా శుభ్రం చేసి స్టెరిలైజ్ చేశారో లేదో కనుక్కోవాలి.
5. ఇంట్లో - ఎవరి టూత్ బ్రష్‌లు, సబ్బులు వారే వాడడం. ఒకరివి ఇంకొకరు వాడరాదు.
6. మల విసర్జన తరువాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. టాయిలెట్‌ను శుభ్రంగా వుంచుకోవాలి.
7. రక్తదానం తీసుకునేముందు, ఇచ్చే ముందు హెచ్‌బిఎస్ ఎజి పరీక్ష చేయించుకోవాలి.
8. వేడిగా వున్నప్పుడే ఆహారం తీసుకోవాలి.
9. వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలి.

చేయకూడనివి :

1. పసరు వైద్యమని, మణికట్టుపై కాల్చుకోవటం వంటి పనులు చేయరాదు.
2. కలుషితమైన ఆహారం, నీళ్ళు తాగరాదు. అపరిశుభ్రత వున్న హోటళ్ళలో, ప్రదేశాల్లో తినరాదు. నీరు తాగరాదు.
3. స్వంత వైద్యం ప్రాణాంతకం కనుక చేసుకోరాదు.
4. సారాయి తాగరాదు.
5. మాంసాహారం కొద్దిరోజుల పాటు తినరాదు.
6. అక్రమ లైంగిక సంపర్కం చేయకూడదు.
7. బాగా నిలువ వున్న ఆహార పదార్థాలు తినరాదు.
8. మలమూత్రాదులతో కలుషితమైన నది, ఏరులలో మునిగిస్నానం చేయరాదు.
9. కల్లు, సిగరెట్లు, బీడీలు తాగరాదు. ఒకరి నోట్లోంచి ఒకరు తీసుకుని తాగరాదు.
10. డాక్టర్‌ను సంప్రదించకుండా మందు వాడరాదు.

ముళ్ళపూడి కదంబరమణీయం-1

ముళ్ళపూడి వెంకటరమణ, బాపుగార్ల కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా తెలుగువారికి చెప్పనవసరం లేదు. పైగా ఈ కాంబినేషన్ గురించి వింటేనే అందరి పెదాలపై అసంకల్పితంగానే నవ్వుల జల్లులు కురుస్తాయి. కానీ ఈ కదంబ రమణీయంలో మరో విశేషం వుంది. అదేమిటంటే ఈసారి హాస్యంతోనే ఆగకుండా చాలా చాలా విషయాలు మనకు తెలియజేశారు.

అవి అమరావతి కథలు - అపురూప శిల్పాలు అంటూ, కొంచెం సేపు మనలను ఆ అమరావతి శిల్పాలతో ముచ్చటింప చేస్తారు. అంతటితో ఆగక శ్రీకృష్ణదేవరాయల అపూర్వ సాహితీ ఖండం ఆముక్తమాల్యద నాయిక శ్రీగోదాదేవి కథను కూడా వివరించటం జరిగింది. ఇంకా మన అభిమాన హాస్య నాయకుడు బారిష్టర్ పార్వతీశం కబుర్లు, ఇంకా చిన్న చిన్న పద్యాలతో వన్నెల జిలుగులు, ప్రముఖులపైన కవితలు అబ్బో ఇంకా ఎన్నెన్నో వున్నాయి. చదవండి మీకే తెలుస్తుంది.

ఈ పుస్తకానికి వున్న మరో గొప్ప ఆకర్షణ ఏమిటంటే ప్రముఖ వ్యక్తులతో పరిచయం. అంటే డా॥ చంద్రశేఖరం, శ్రీ భవిడిపాటి కామేశ్వరరావు, నాగేశ్వరరావుగారు, ఈమని శంకరశాస్త్రిగారు ఇలాంటి ప్రముఖులతో తన అనుభవాలు, వారి జీవిత విశేషాలు మొదలైనవి. ఈ కాలం యువతీ యువకులు చాలా మందికి బహుశా వీరి పేర్లు కూడా తెలియవేమో. శ్రీవారి బ్రహ్మోత్సవాలు, మెంటాలిటీలు ఒకటేమిటి వంటకు పనికొచ్చే ఉల్లిపాయ దగ్గర నుంచి ఆడవాళ్ళ సౌందర్య సాధనాల వరకు, శాస్త్రీయ సంగీతమే కాక అమెరికన్‌జాజ్ సంగీతం వరకు మిత భాషణం 'లెటరేచర్, శృంగారం, సాహిత్యంఒకటేమిటి అన్ని రసాలను పండించిన ఘనత శ్రీరమణగారికే దక్కింది.

- నాగశిరీష

కదంబ రమణీయం-2

ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో వచ్చిన హాస్య రచనలను వేళ్ళమీదే లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది. వ్యంగ్యాన్ని ఆశ్రయించి మనసు గిలిగింతలు పెట్టేలా హాస్యాన్ని పండించడంలో ముళ్ళపూడి వెంకటరమణకు సాటి ఎవరూ లేరు. వారి వ్యంగ్యం ఎక్కువగా శబ్దాశ్రయమైనది. పదాలను విరిచి కొత్త అర్థాలను సృష్టించడమో - విస్తృతపరచడమో చేసి సరికొత్త హాస్యాన్ని సృష్టించడం, అన్య దేశాలను వ్యావహారికం లోనికి అన్వయించడమూ, సామెతలను - నుడికారాలను హాస్యానికి అనువుగా, వ్యంగ్యంగా మలచుకోవడం, వాడుకలో వున్న పదాలను-పదబంధాలను విడదీయడమో లేక అదనంగా అక్షరాలను చేర్చడమో చేసి కొత్త అర్థాలను రూపొందించడం - ఇలా వీటిని తనకనువుగా ఎక్కడికక్కడ వ్యంగ్యంగా వాడుకోవడం ముళ్ళపూడి రచన స్పెషాలిటీ. భాషమీద పట్టు, విషయ వివరణ, హాస్య చతురత వుంటేనే ఇలాంటి రచనలు రక్తిగడతాయి. తనకు తెలిసిన జ్ఞానాన్ని తెలివిగా ఎదుటి వారిని బోల్తా కొట్టించడానికి ఈ రకమైన వాక్చాతుర్యం చూపే పాత్రలు తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచింది గిరీశం పాత్ర. ఇంతకీ గిరీశం విదూషకుడా? నాయకుడా? అన్న ప్రశ్న కాదు. అతడ్ని ఒక హాస్య నాయకుడిగా మలచుకున్నారు. అతని ప్రవర్తన, గుణము, మాటతీరును ఆధారంగా చేసుకుని తనకు తెలిసిన విషయాలను ముఖ్యంగా సినీమాయాజాల వింతలతో పాటు అమాయకులను ఆ ఊబిలోకి దిగలాగి తాము లాభపడాలని చూసే స్వార్థపర శక్తులు ప్రతీకగా గిరీశంను చేసుకొని, అక్కడ వేళ్ళూనుకొని వున్న అవినీతిని - మోసపూరిత వాతావరణాన్ని 'గిరీశం లెక్చరు'గా తీర్చిదిద్దారు.



కదంబ రమణీయం-1 & 2
రచన : ముళ్ళపూడి వెంకటరమణ,
వెల : ఒక్కో సంపుటం రూ. 150/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

తెలుగువాడికి పుస్తకాలు కొనిచదివే అలవాటు అప్పుడు లేదు, ఇప్పుడూ లేదు. దాన్ని నిరసిస్తూ వ్యంగ్యంగా ఆక్షేపించడమే 'మైగాడ్ పుస్తకాలు కొనడమా! బార్బేరియస్' తెలుగు వారు ఉన్నంతకాలం ఈ వ్యాసం సజీవంగానే వుంటుంది. వితంతు వివాహం ఇతివృత్తంగా సినీమాల ఆవశ్యకత గురించి చెబుతూ బుచ్చెమ్మను ఆకర్షించాలనుకునే వ్యాసం మరొకటి. ఈ రెండూ జనరల్ వ్యాసాలు కాగా మిగతావన్నీ సినిమా వ్యాసాలే. వీటిలో సినిమాకు కథరాయడం, సినిమాల్లోని గొప్ప డైలాగులు, కథ ఏమిటో చెప్పకుండా సినీమా తీయించిన కవిగారి కథ, నవరసాల పేరిట అందర్నీ మెప్పించే చిత్రం ఎలా ఉండాలన్న చర్చ, ఇచ్చే పారితోషికంను బట్టే ఉండాలి అంటే ఇన్ని విషయాలు కూలంకషంగా వివరించిన గిరీశం సినీమా తీయడం కోసం దర్శకత్వం కోసం ప్రయత్నించి భంగపడిన వ్యాసాలు కూడా వున్నాయి. పొడుగు తగ్గితే సినిమాలు బాగుపడతాయనుకోవడం భ్రమ అని తేల్చి చెబుతూ, డబ్బింగ్ సినీమాల ప్రచార మాయాజాలాన్ని తెలియజేస్తారు. ఒక్కోసినిమా ఫెయిలయినప్పుడల్లా ఇలా తీసి వుండకూడదని నేర్చుకోవడాన్ని చూపిస్తాడు. కళాఖండాల లోగుట్టు తెలియజేస్తూ, మనం తీసినవే కళాఖండాలని బుకాయించడాన్ని, కళాఖండాలకు ప్రభుత్వ సహాయాన్ని వివరిస్తూ "సినిమాలన్నీ జీవితంలా వుంటే, అసలే జీవితమంటే మొహం మొత్తుతున్న జనం సినీమాలెందుకురా అని మానీగ్రలు" అంటూ ప్రేక్షకుల నాడిని తెలియజేయడంలో సార్వజనీనత ఉందని వేరుగా చెప్పనవసరం లేదు. చివరగా గురజాడకు నాలుగు నమస్కార బాణాల పేరిట సంధించిన నాలుగు వ్యాసాలు వున్నాయి. రచయితకున్న సినీ పరిజ్ఞానాన్ని ఇలా అన్యాపదేశంగా గిరీశం ద్వారా తెలియజేసిన ఈ వ్యాసాల ఒరవడి తర్వాత కాలంలో పద్మమన్నాటి కుటుంబరావులాంటి రచయితలెందరికో ప్రేరణగా నిలిచింది.

"శ్రీకృష్ణలీలలు" చిన్న చిన్న వాక్యాలతో అందంగా, కవితాత్మకంగా మార్చిన పురాణ నవల బాపు బొమ్మలతో మరింత శోభాయమానంగా తయారయ్యింది. భాషాపరంగా చిన్న పిల్లలకు అనువుగా తీర్చిదిద్దినట్లయితే మరింత పాపులారిటి పెరిగేది. అధ్యయనశీలి, మితభాషి, ప్రముఖ పాత్రికేయులు నండూరిగారిని 'ఫ్రెండూరి'గా భమిటిపాటి గారి హాస్య చతురతను "భకారాగారి నవ్వుల నగారా"లో ఆత్మీయంగా, ఆసక్తికరంగా తెలియజేశారు. వ్యాస రమణీయంలో "అన్నీ మీవి, వెన్నే నాది" అని డిక్లేర్ చేసిన బాలకృష్ణుడ్ని చూడవచ్చు. 'పొగడ్త, ఉచ్చారణ' లాంటి అంశాల మీద జరిపిన సుదీర్ఘ చర్చలలో వ్యంగ్యమూ ఉంది. విజ్ఞానాత్మక సమాచారమూ ఉంది. పాఠకుల లేఖలపై వచ్చిన మంచి పేరడీ వ్యాసం "ధన్యవాదాలూ - అన్యవాదాలూ' స్త్రీ రమణీయంలో ఆడవాళ్ళ మాటలకు అర్థాలే వేరులే అన్న విధంగా రూపొందిన "మన మాటల మరమ్మత్', 'మీరే చెప్పండి ఎవరు దుబారా? నేనా - మావారా?"లో నిలదీసిన భార్య వాక్చాతుర్యం, "అత్తలూ - కోడళ్ళూ మనస్తత్వాలను వివరించే వ్యాసం ఒకటికాగా, ఒక టీనేజీ కుర్రాడి ప్రేమ భావనను చిత్రీకరించిన 'లక్ష్మీ' కథ చివరన కొన్నిజోకులతో ఈ సంపుటి ముగుస్తుంది. హాయిగా నవ్వుకోవడానికి, నవ్వి ఆనందించడానికి, మళ్ళీ మళ్ళీ నవ్వుకోవడానికి ఈ పుస్తకం తప్పకుండా చదవాలి.

- కె.పి.అశోక్ కుమార్



ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారం తూర్పు గోదావరి

తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందింది. గోదావరి గలగలలు... పచ్చని వరి చేలు... కోనసీమ కొబ్బరి తోటలు... సహజవాయు నిక్షేపాలు... కడియపు లంక పూదోటలు... దట్టమైన అడవులు, అభయారణ్యం... గోదావరిలో లాంచీ ప్రయాణం... అన్నవరం సత్యనారాయణ స్వామి, ఇంకా ఎన్నో ప్రాచీన ఆలయాలు.. ఇవన్నీ కలిపితే తూర్పు గోదావరి జిల్లా అవుతుంది....

శేషు

ప్రకృతిని ఆరాధించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశం అమలాపురం అదే కోనసీమ...కాకినాడకు 50 కిలోమీటర్ల దూరాన సముద్రానికి దగ్గరలో, నదులు, కాలువల నడుమ గల కోనసీమ జిల్లాకే అందాన్ని తెచ్చింది. రాష్ట్రంలో అతిపెద్ద కొబ్బరితోటలు ఇక్కడే ఉన్నాయి.. వరిపొలాలు, అదేవిధంగా రాష్ట్రాన్ని భారతదేశ చిత్రపటంలో సమున్నతంగా నిలిపిన సహజవాయు నిక్షేపాలు కూడా కోనసీమలోనే ఉన్నాయి.. వరిపొలాలు, కొబ్బరితోటలు అంటే తెలియని పర్యాటకులను కోనసీమ ఒక అద్భుత ప్రపంచంలోకి తీసుకువెళుతుంది..

కడియపు లంక

రాజమండ్రికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో గల కడియపు లంక ఒక చిన్న గ్రామం.. అయినా పూదోటల నర్సరీల్లో రాష్ట్రవ్యాప్తంగా పేరుపొందింది. ఇక్కడి నర్సరీల్లో దొరకని పండ్ల, పూల మొక్కలు రాష్ట్రంలో మరెక్కడా దొరకవు. ప్రతిఏటా జనవరిలో ఇక్కడ పూల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. ఆ సమయంలో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు.

రంప చోడవరం

దట్టమైన అడవుల్లో ఉన్న అమాయక గిరిజనులు, అక్కడ గల వాటర్ ఫాల్స్ అత్యంత రమణీయంగా ఉంటుంది. ఇక్కడికి వెళ్ళడానికి ఎక్కువగా గోదావరిలో లాంచీలోనే ప్రయాణిస్తారు. అదొక మధురమైన అనుభూతి..రాజమండ్రిలో లాంచీ ఎక్కి ఎగువకు 50 కిలోమీటర్లు ప్రయాణిస్తే రంపచోడవరం వస్తుంది. ఇక్కడి గిరిజన మహిళలు ప్రదర్శించే వేలా గిరిజన నృత్యం చాలా ప్రసిద్ధి పొందింది. గిరిజన పురుషులు చేసే కొమ్ము నృత్యం కూడా ఈ ప్రాంతానిదే. రంపచోడవరానికి 20 కిలోమీటర్ల దూరంలో గల ఎత్తయిన ప్రదేశం మారేడుమల్లి దట్టమైన అడవుల్లో ఉంది. ఇక్కడి వాటర్‌ఫాల్స్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మారేడుమల్లి అడవుల్లో కాఫీ, రబ్బరు సాగు చేస్తున్నారు.

అన్నవరం

పిఠాపురానికి 32 కిలోమీటర్ల దూరంలో గల అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయం జిల్లాలోనే గాక చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ప్రసిద్ధిచెందింది. పంపానదీ తీరాన రత్నగిరి కొండలపై ఉన్న ఈ ఆలయం పరిసరాలు ప్రకృతి అందాలతో శోభిల్లుతుంది. ఇక్కడకు వచ్చే భక్తులు, యాత్రికుల కోసం దేవస్థానం నిర్వాహకులు ఎన్నో సదుపాయాలు కల్పించారు. తూర్పుగోదావరి జిల్లాలో ద్రాక్షారామం, ద్వారపూడి, బిక్కవోలు, అంతర్వేది తదితర ఎన్నో ప్రసిద్ధి చెందిన ఆలయాలున్నాయి.

వన్య మృగసంరక్షణ కేంద్రం

గోదావరి తీరన దట్టమైన అడవుల్లో 591 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పాపికొండ వన్యమృగ సంరక్షణకేంద్రం విస్తరించి ఉంది. రాజమండ్రికి 50 కిలోమీటర్ల ఎగువున గల ఈ ప్రాంతంలో ఎన్నో రకాల క్రూరమృగాలు, సాధు జంతువులు రక్షించబడుతున్నాయి. అదేవిధంగా కాకినాడకు 20 కిలోమీటర్ల దూరంలో సముద్రతీరాన గల అడవుల్లో కూడా వన్యమృగసంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ అనేకరకాల సముద్రజీవులు ఉంటాయి. ఇవన్నీ కూడా పర్యాటకులను విశేషంగా అలరిస్తాయి. ★



కడియపు లంక నర్సరీలు



అన్నవరం

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన బహుముఖ పాత్ర గురించి తెలుగు సాహిత్యరూపంలో వచ్చింది బహుకొంచెమే. అందులో ప్రజల చెంతకు చేరింది మరీ కొంచెమే. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో ఖ్యాతి గాంచిన 'క్విట్ ఇండియా' నినాదం సృష్టికర్త ఓ ముస్లిం అని, అతని పేరు యూసుఫ్ మెహర్ అలీ అని చాలా మందికి తెలియదు. అటువంటి ముస్లింలు సాగించిన వీరోచిత పోరాటాలను, త్యాగాలను చారిత్రక ఆధారాలతో, సాక్ష్యాలతో పరిశోధన చేసి వరసగా పుస్తకాలు వెలువరిస్తూ పాఠకుల చెంతకు చేరుస్తున్న రచయిత సయ్యద్ నశీర్ అహ్మద్. కవిగా, రచయితగా, మంచివక్తగా, న్యాయవాదిగా, పాత్రికేయుడిగా, అన్నిటికంటే ముఖ్యంగా ముస్లిం సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన చారిత్రక పరిశోధకుడిగా తన సాహిత్య సేవను అందిస్తున్న నశీర్ అహ్మద్ సుపరిచితుడే.

చారిత్రక పరిశోధకుడు 'నశీర్ అహ్మద్'

సయ్యద్ నశీర్ అహ్మద్ డిసెంబర్ 22, 1955వ సంవత్సరంలో నెల్లూరు జిల్లా పురిణి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య పురిణి గ్రామంలో, ఉన్నత విద్య కావలి, నర్సరావుపేట, భోపాల్, చిత్రదుర్గ, గుంటూరులలో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుండే సమకాలీన సమాజాన్ని అధ్యయనం చేయడం ద్వారా, చక్కని పరిశీలనా దృష్టిని, సేవాభావాన్ని అలవర్చుకుని వికలాంగులు, అంధుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారు స్వయం కృషితో అభ్యున్నతి దిశగా సాగేందుకు సంఘాలు ఏర్పాటు చేయించి చురుకైన మార్గదర్శకత్వం వహించారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, ఆ తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. న్యాయవాదిగా పని చేస్తూనే వివిధ దినపత్రికల్లో విలేకరిగా పలు వార, పక్ష, మాస పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలను,

ఎన్నికలు

ఎన్నికలు
కలల విధ్వంస పాచికలు
కాకి లెక్కలు
కబ్జా బతుకులు
ప్రజలచేత ప్రజల కోసం
ప్రజా ప్రభుత్వం
హక్కులు - రాజ్యాంగం
చట్టం - న్యాయం
స్కోప్పు కలర్ల ప్రపంచం
మంధిర్ - మసీద్
అమీర్ - గరీబ్
అలాయి - బలాయి
మురికి వాడల్ల అత్తర్ల కంపు
ఫరక్ నహీ రహేగా
ఏండ్ల తరబడి బొంకించుడె
నాయకులు మారలె
మనుషులు మారలె
గాయాలు మానలె
జెండాలు బదలాయించుకుంటుండ్రు

తుపాకీ నీడలు
బాంబులు భద్రత
పైసల్ని దిగమింగిన బ్యాలెట్
రక్తం మరకల నడుమ
మృత ప్రజాస్వామ్యం
పురుడు పోసుకుంటుంది
ఫ్యాక్టరీలు పాతర
వృత్తులు మాయం
ఉపాధి మాయం
అప్పులు పెరిగె
విజన్ల మీద విజన్లు
ఐదేండ్ల జులుం హల్‌చల్
హక్కులు హర్తాల్ ఛోడో
మాట్లాడే మనుషులు మాయం
'ఫీల్‌గుడ్
'భారత్ వెలుగుతోంది'

- జీగురు అయిలయ్య

ఉచితంగా తన సేవలను అందించారు. ఆయన రాసిన పలు వ్యాసాలు, కవితలు, గేయాలు, కథలు, కధానికలు దాదాపు అన్ని ప్రముఖ తెలుగు పత్రికలలో ప్రచురించబడ్డాయి.

అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే, నశీర్ అహ్మద్ ఇటీవల రచించి, పరిశోధన సాగించి వెలువరించిన ముస్లిం సాహిత్యమంతా ఒక ఎత్తుగా పేర్కొనాలి. ఎందుకంటే భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింలు సాగించిన వీరోచిత పోరాటాలు, త్యాగాలు ఎన్నో మరుగున పడి వున్నాయి. భారతదేశం కోసం వారు చేసిన త్యాగాలు, అపారమైన దేశభక్తి మనదేశ ప్రజలలో చాలామందికి తెలియదనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అటువంటి ముస్లిం సోదరుల జీవితాలను, చారిత్రక సంఘటనలను, వీరోచిత పోరాటాలను కళ్ళకు కట్టినట్లు గ్రంథరూపంలోకి తీసుకొచ్చి ఇప్పటితరం వారికి అందిస్తున్నారు నశీర్ అహ్మద్. ఒకటీ ఆరా వచ్చే ముస్లిం సాహిత్యం పాఠకుల చెంతకు అంతగా చేరలేకపోవచ్చు. కాని వరుసగా ముస్లిం సాహిత్యం గ్రంథాల రూపంలో తేవటంతో పాఠకుల కళ్ళు ఈ సాహిత్యంపై ఒక్కసారిగా మళ్ళీ, వారి గురించి తెలుసుకోవాలనే కుతూహలం పెరిగి, ఈ గ్రంథాలు చదివించేలా చేస్తున్నాయనటంలో ఏ విధమైన అసత్యం లేదు. 'భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లింలు, మైసూర్‌పులి-టిప్పుసుల్తాన్, షహీద్-ఏ-ఆజం అష్ఫాకుల్లాఖాన్, భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం మహిళలు, భారత స్వాతంత్ర్యోద్యమం - ఆంధ్రప్రదేశ్ ముస్లింలు, భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం ప్రజా పోరాటాలు' ఇప్పటివరకూ నశీర్ వెలువరించిన ముస్లిం సాహిత్య గ్రంథాలు. ఈ గ్రంథాలు నశీర్‌కు ఎంతగానో పేరు తెచ్చిపెట్టాయి. మన రాష్ట్ర గవర్నర్ సుర్జీత్‌సింగ్ బర్నాలా నుండి కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి వరకూ ఈ ముస్లిం వీరోచిత పోరాట గ్రంథాలను చూసి ప్రత్యేకంగా నశీర్‌ను అభినందించారు.

నశీర్ వెలువరించిన ఈ గ్రంథాలలో కొన్ని పునఃముద్రణ జరుపుకోగా, మరికొన్ని కాపీలు అయిపోయి మళ్ళీ ముద్రణకు సిద్ధమయ్యాయంటే ఈ సాహిత్యానికి పాఠకులలో ఎంత విలువ, ఆదరణ పెరిగిందో అర్థమవుతుంది. భారతీయ ముస్లింల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల మీద పరిశోధన సాగిస్తున్న నశీర్ అహ్మద్, పరిశోధనాత్మక గ్రంథ రచనే తన ప్రధాన లక్ష్యమని, దానికి ఏర్పడే ఇబ్బందులు, కష్టనష్టాలను సైతం లెక్కచెయ్యనంటారు. చరిత్ర, ఆర్థిక, సామాజిక శాస్త్రాల అధ్యయనం పట్ల ఆసక్తి, జాతీయ అంతర్జాతీయ సంస్థలలో సభ్యునిగా పలు సభలు, సమావేశాలలో పాల్గొన్న ఆయన మంచివక్త, దేశంలోని అన్ని సాంఘిక జనసముదాయాల మధ్య స్నేహం, సామరస్యం, సుహృద్భావ వాతావరణం మరింత విలసిల్లాలని ఆకాంక్షించే మానవతావాది, లౌకిక ప్రజాస్వామ్య వాది. అసలు ఈ ముస్లిం సాహిత్యం పరిశోధించి గ్రంథరూపంలో తేవాలని మీకెలా స్ఫురించిందని అడిగినప్పుడు భారతదేశంలోని బహుళజాతుల మధ్య పరస్పర గౌరవ మర్యాదలు ఏర్పడాలంటే ఆయా సాంఘిక జనసముదాయాలకు వాళ్ళ భాగస్వామ్యాలెటువంటివో తెలియవల్సి వుంది. మతకలహాలు సృష్టించి అరాచకాలు లేవనెత్తుతున్న ప్రస్తుత వర్తమాన పరిస్థితులలో ఒకరి గురించి ఒకరు తెలుసుకుని అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఇంకా వుంది. అందులో వలస పాలకుల నుండి దేశ విముక్తి కలిగించటంలో సరైన పాత్ర వహించిన ముస్లింలు విస్మరించబడ్డారు. ఆ వాస్తవ పరిస్థితులను లోకానికి చాటాలనే ఈ ప్రయత్నం" అన్నారాయన. భవిష్యత్తులో ఇంకెటువంటి గ్రంథాలు వెలువరించనున్నారు అనే ప్రశ్నకు 500 పేజీలతో 'భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లిం యోధులు' అనే బృహత్తర గ్రంథానికి శ్రీకారం చుట్టారు. వందమంది జీవిత చరిత్రలను, మూడువేల మంది పోరాట యోధుల సంక్షిప్త పరిచయాలను ఇందులో పొందుపరుస్తున్నాను. ఇంకా 'భారతీయ ముస్లింలు', 'భారతీయ ముస్లిం సోదరులు - అపోహలు - వాస్తవాలు' గ్రంథాలు వెలువరించే ప్రయత్నాలు చేస్తున్నాను. ప్రస్తుతానికి వాటిని సేకరించే ప్రయత్నంలో వున్నాను' అన్నారు నశీర్ అహ్మద్. భారతీయ ముస్లిం సోదరులు జరిపిన వీరోచిత పోరాటాలు, త్యాగాలను ఈ లోకానికి చాటుతున్న నశీర్ అహ్మద్ ప్రయత్నాలు మరింత విజయవంతం కావాలని, ఈ గ్రంథాలు సర్వమానవ సమానత్వం, మత సామరస్యాలకు మరింత దోహదపడాలని ఆశిద్దాం. ★



పరాయి పంచలోకి

నీ ఇంట్లో
నువ్వే పరాయివాడివి
నీకంట్లో
నువ్వే నలుసువి
నువ్వు పెంచుకున్న మొక్కమీద
నీకు హక్కులేదు
నువ్వేకూర వండుకోవాలో
ఎవరో నిర్ణయించాలి
నువ్వు ఏ రోడ్డు గుండా నడవాలో
ఎవరో నిర్దేశించాలి
నీ భూమి నీది కాదు
నీ విత్తనం నీది కాదు
నువ్వు నిరాయుధుడివి
యుద్ధం చెయ్యకుండానే పరాజితుడివి
నమ్ముకున్న నేలనే
భిక్షపాత్ర చేసిన తర్వాత
ఏ వధకాలు నిన్ను కరువు నుంచి
కాపాడతాయి
ఏ ప్రమాణాలు నీకు నీడనిస్తాయి
అయిన వాళ్ళని అడుగుల కింద
కానివాళ్ళను నెత్తిన చేర్చుకున్నాక
అన్నీ తలకిందులే

\- ఏ.వి.ఆర్.మూర్తి

న్యాయసలహాలు

- జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

మాకు బి.సి. రిజర్వేషన్ వర్తిస్తుందా?

మా నాన్న స్వంతవూరు కర్నాటక రాష్ట్రం బిక్కబిలాపురం. బెంగుళూరు డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం రైల్వే స్టేషన్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మాది బలిజకులం అయినందున మా నాన్నకు కర్నాటక రాష్ట్రంలో ఓ.బి.సి.గా సర్టిఫికెట్ వచ్చింది. బలిజకులం ఇక్కడ ఓ.సి.గా ఉంది. నేను డిప్లమో చేసి డిగ్రీ చేసినాను. నాకు ఓ.బి.సి.గా రిజర్వేషన్ హిందూపురంలో సర్టిఫికెట్ దాఖలు చేసుకొనేందుకు అర్హుడినా. ఓబిసి రిజర్వేషన్ నాకు వర్తిస్తుందా. దయచేసి నా ప్రశ్నకు సమాధానం ఇస్తారని ఆశిస్తున్నాను.

– డి.ఎల్.గణేష్ బాబు, హిందూపురం, అనంతపురం జిల్లా.

మీరు కర్నాటక ప్రాంతం వారు కాబట్టి కులధృవీకరణ కర్నాటకలోనే పొందాల్సి వుంటుంది. మీరు కర్నాటక రాష్ట్రం పరిధిలో ఓ.బి.సి. కిందకు వస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో బలిజకులం ఓ.సి.లో ఉన్నది కాబట్టి మీ కులం ఓ.సి.గానే గుర్తిస్తారు. మీకు ఇక్కడ రిజర్వేషన్ వర్తించదు. కులాల ధృవీకరణ రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వ్యవహారం. ఇక్కడ మీకు రిజర్వేషన్ వర్తించదు.

తీర్పు వచ్చేవరకూ ఆగాల్సిందే!

మాకు గాజువాక మున్సిపాలిటీలో ఇల్లు కలదు. గాజువాక భూములపై గత 10 సంవత్సరాల నుండి ఏ విధమైన లావాదేవీలు, రిజిస్ట్రేషన్స్ జరగడం లేదు. హౌస్ కమిటీ సిఫార్సులు కాదని, ప్రభుత్వ జి.ఓ. విడుదల చేసి, అన్ని సర్వే నంబర్లు వారికి అక్విజిషన్ కొరకు ఫీజు నిర్ణయించి కట్టమన్నారు. కాని దాని ఇనాముదారుడు హైకోర్టులో స్టే తెచ్చి సంవత్సరం గడిచిపోయింది. గతంలో మేము ఇనాందారునికి చెల్లింపు జరిపి ఆర్.పి. ఎమ్.ఆర్.ఓ. ద్వారా పొంది యుఎల్‌సిపై రిజిస్టర్ పొందినాము. ఇట్టి పరిస్థితులలో మా ఇల్లు అమ్ముటకు గాని, వేరే విధంగా మార్చుటకు గాని వీలు లేని పరిస్థితి. జిఓ:515/03 ద్వారా బంజర్లు ఆక్రమించుకున్న వారికి ప్రభుత్వం వారు క్లియరెన్స్ ఇచ్చినారు. మా సమస్యకు పరిష్కారం చూపగలరు. సలహా కొరకు ఎదురు చూస్తూ...

– కె.టి.ఆచార్యులు.టి.5, సిటిజన్స్, వైజాగ్

ప్రభుత్వం అనుమతించినా హైకోర్టులో ఇనాందారుడి తరఫున స్టే ఉంది. కాబట్టి మీరు హైకోర్టులో స్టే వెకేట్ చేసేంత వరకు అనగా కోర్టు తీర్పు ఇచ్చే వరకు వేచి ఉండి అది వచ్చాక దాని ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవలసి ఉంటుంది. మీ సమస్యకు పరిష్కారం కోర్టు తీర్పు ద్వారానే లభిస్తుంది.

కేసు తేలడం లేదు

క్యాట్‌లో కేసు ఫైల్ అయి ఉండగా పోస్టల్ రివిజనరీ అథారిటీ వారికి, నా రిమూవల్ గురించి రివిజన్ పిటీషన్ పంపించాను. దాదాపు 2 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వారు నా పిటీషన్‌ను ఏ విధంగానూ పరిష్కరించని కారణంగా, నా పిటీషన్ విత్‌డ్రా చేసుకోదలచి, వారికి విత్‌డ్రా పిటీషన్ పంపించాను. ఆ విత్‌డ్రా పిటీషన్‌ను వారు ఆమోదించడం/తిరస్కరించడం గాని చెయ్యలేదు. అసలు వారు నాకు సమాధానం ఇస్తారో లేదో తెలియడం లేదు. నా రివిజన్ పిటీషన్, విత్‌డ్రా పిటీషన్‌లు పెండింగ్‌లో వున్న కారణంగా ఆగిపోయిందేమోనన్న అనుమానం కలుగుతోంది. సాధారణంగా రివిజన్ పిటీషన్‌ను ఎన్ని రోజులలో పరిష్కరించాలి? ఈ విషయమై పై అధికారులకు తెలిపర్చినప్పటికీ వారు ఏ విధమైన చర్య తీసుకోలేదు. అంతేకాక లీగల్ సర్వీసెస్ అథారిటీ–హైదరాబాద్ వారి నుండి తొందరగా పరిష్కరించమని రివిజనరీ అథారిటీ వారికి ఆదేశాలు జారీ అయి సంవత్సరం దాటినా సరే, నా పిటీషన్స్ ఏ విధంగానూ ఇంతవరకు పరిష్కరించలేదు. క్యాట్‌లో కేసు తేలక, రివిజనరీ అథారిటీ వారి వద్ద నున్న పిటీషన్స్ కూడా పరిష్కారం అవక నేను చాలా మానసిక వేదనకు గురవుచున్నాను. దయచేసి నాకు తగిన సలహా సూచించవలసిందిగా కోరుతున్నాను.

పేరు లేదు, అమలాపురం.

మీరు ఈ పాటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కావున న్యాయస్థానం తీర్పుకై ఎదురు చూడాల్సిందే. త్వరగా కేసు విషయం తెలియాలంటే మీ పరిస్థితులు వివరిస్తూ ఎందుకు త్వరగా చేయాలో మీ లాయర్‌ని సంప్రదించి, త్వరగా తీర్పు ఇవ్వమని మరో పిటిషన్ ఫైల్ చేస్తే సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వాళ్ళు మీ విషయాలు, పరిస్థితులు పరిగణనలోకి తీసుకొని నిర్ణయం చేస్తారు. ట్రిబ్యునల్‌లో కేసు పెండింగ్ ఉన్నందున కమిటీ వాళ్ళు కోర్టు నిర్ణయం వచ్చాక చూద్దామనే అభిప్రాయంలో ఉండి ఉంటారు. కావున ఏ నిర్ణయం తీసుకుని ఉండరు.

రుచి

బైంగన్ భర్తా

కావలసిన వస్తువులు:

వంకాయలు	:	300 గ్రాములు
వెల్లుల్లి	:	10 గ్రాములు
ఇంగువ	:	చిటికెడు
పెద్దఉల్లి	:	వంద గ్రాములు
గరం మసాలా	:	5 గ్రాములు
పసుపు	:	5 గ్రాములు
కారం	:	5 గ్రాములు
జీలకర్ర	:	5 గ్రాములు
నూనె	:	50 గ్రాములు
కొబ్బరి పొడి	:	10 గ్రాములు
కొత్తిమీర	:	ఒక కట్ట
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం:

వంకాయలను అర లీటరు నీటిలో ఉడికించాలి. ఉడికిన తరువాత దించి చల్లారనివ్వాలి. తరువాత దానిని మెత్తగా మెదపాలి. బాండీలో నూనె పోసి వేడి చేయాలి. అందులో జీలకర్ర, వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, ఇంగువ, కారం ఉప్పు వేయాలి. ఇవన్నీ కొంచెం వేగిన తరువాత మెదిపి ఉంచిన వంకాయను వేయాలి. సుమారు 15-20 నిముషాలు సన్నని సెగమీద ఉడకనివ్వాలి. దించే ముందు కొబ్బరి పొడి, సన్నగా తరిగిన కొత్త మీరను వెయ్యాలి. ఇది చపాతీలో చాలా రుచిగా ఉంటుంది. ఇది పంజాబీ వంటకం.

శ్రీఖండ్



కావలసిన వస్తువులు:

పెరుగు	:	ఒక కిలో
పంచదార	:	పావు కిలో
యాలుకలు	:	ఐదారు
పిస్తా	:	5గ్రాములు
బాదం	:	5గ్రాములు
జీడిపప్పు	:	5 గ్రాములు

తయారుచేసే విధానం:

పాలను కాచి ఉదయాన్నే తోడు పెట్టాలి. ఆ పెరుగును సాయంత్రం పరిశుభ్రమైన పల్చని గుడ్డలో మూటకట్టి ఏదైనా మేకుకు వేలాడతీయాలి. ఉదయానికి నీరంతా పోతుంది. ఇప్పుడు పెరుగులో చక్కెరను మెత్తగా పొడిచేసి బాగా కలపాలి. బాదం, పిస్తాను కూడా నానబెట్టి ఉంచుకోవాలి. వాటిని పొట్టు తీసేసి సన్నని ముక్కలుగా చేయాలి. జీడిపప్పును కూడా చిన్న ముక్కలుగా చేసుకోవాలి. చక్కెరతో బాగా కలిపిన పెరుగులో వేసి కలపాలి. యాలకులను కూడా మెత్తగా పొడిచేసి కలపాలి. దీనిని మహారాష్ట్రులు ఎంతో ప్రీతిలో తింటారు.

వంటలు పంపవలసిన చిరునామా:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
అశోక్‌నగర్, స్ట్రీట్ నెం:1
హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

టిపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

Cyan